నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
సోమవారం | సెప్టెంబర్ 04, 2023 | www.navatelangana.com

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-సిరికొండ



పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, ఏఎస్సై అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన శ్రీకాంత్(21) యువకుడు శనివారం ఉదయం తన పంట పొలంలోకి పనుల నిమిత్తం వెళ్లాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో, తన తండ్రి కొడుకు ఎందుకు రావడం లేదని చేనులోకి వెళ్లి చూడగా, అప్పటికే పురుగులమందు తాగి అపస్మారక స్థితిలోకి పడిపోయి, కొట్టుకుంటూ పడి ఉన్న కొడుకును చూసి స్థానికుల సహాయంతో అంబులెన్సులో రిమ్స్‌కు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై తెలిపారు.

జీఓ నెంబర్ 3కి చట్టబద్ధత కల్పించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

జీఓ నెంబర్ 3కి ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని ఆదివాసీ, గిరిజన పాధ్యాయ సంఘ నాయకులు శ్యామ్‌రావ్, బాదు, ఉత్తమ్ అన్నారు. ఈ మేరకు పలు ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ప్లకార్డులతో నిరసన తెలిపి, అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నాయకులు ప్రభుత్వం చేపట్టిన బదిలీలు పదోన్నతులు జీఓ నెంబర్ 3 ప్రకారం స్థానిక గిరిజనులకు అవకాశం కల్పించాలని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులలో గిరిజన ఉపాధ్యాయులకు 100శాతం పదోన్నతులను ఏజెన్సీ నుంచి ఏజెన్సీకి బదిలీ చేపట్టాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు గణేష్, జగన్నాథ్‌రావ్, అమిత్ చవాన్, రవీందర్, రామారావు, ప్రకాష్, కృష్ణ, జ్ఞానేశ్వర్ ఉన్నారు.

సగానికి తగ్గించేశారు..!

- పీఎం కిసాన్ సమ్మాన్ నిధిలో భారీగా కోత
- నాలుగేండ్లలో గణనీయంగా తగ్గిపోయిన రైతుల సంఖ్య
- కొత్తగా పట్టాలు పొందిన వారికి దక్కని సాయం
- ఈ-కేవైసీపై అవగాహన కల్పించడంలో అధికారుల వైఫల్యం
- రైతులకు లభించని కేంద్రప్రభుత్వ భరోసా

అన్నదాతలకు పెట్టుబడి సాయం కోసం కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి అందరికీ దక్కడం లేదు. ఈ పథకం కింద లబ్ధి పొందే రైతుల సంఖ్యను గణనీయంగా తగ్గించారు. ఫలితంగా రైతులందరికీ కేంద్రం అందించే పంట పెట్టుబడి సాయం అందని ద్రాక్షగానే మారుతోంది. ఈ పథకం ప్రారంభమైన నాలుగేండ్లకే రైతుల సంఖ్యను సగానికి తగ్గించారు. కొత్తగా పట్టాలు పొందిన వారికి పరిగణనలోకి తీసుకోకపోవడం.. రైతులు ఈ -కేవైసీ చేయించుకోలేకపోవడం వంటి కారణాలతో పాటు కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగం కలిగిన వారికి ఈ పథకం వర్తించడం లేదని తెలుస్తోంది. మరోపక్క తొలుత భూమి కలిగిన రైతులందరికీ ఈ పథకం వర్తించగా.. కొన్నేండ్ల నుంచి 5 నుంచి 10 ఎకరాలు కలిగిన వారికి మాత్రమే పరిమితం చేసినట్లు తెలుస్తోంది. ఫలితంగా ఈ పథకం కింద లబ్ధిపొందే రైతుల సంఖ్య ప్రతి ఏటా తగ్గిపోతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం మాదిరిగానే కేంద్రం కూడా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పేరిట రైతులకు ఎకరానికి రూ.2వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తోంది. ఏడాదిలో మూడు విడతలుగా ఎకరానికి రూ.6వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. కానీ ఈ పథకం ప్రారంభమైన తొలి విడతలో రైతులందరికీ వర్తింపజేయగా..తాజాగా ఏటా రైతుల సంఖ్యను వివిధ కారణాలతో తగ్గించడం కారణంగా కొందరికి మాత్రమే ఈ పథకం పరిమితమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద ఎకరానికి రూ.5వేల చొప్పున రెండు విడతల్లో రూ.10వేలు అందజేస్తోంది. కేంద్రం మాత్రం ఏడాదికి రూ.6వేల చొప్పున ఈ సాయం అందజేస్తోంది. కేంద్రప్రభుత్వం 2019లో ఈ పథకం ప్రారంభించిన సమయంలో తొలి విడతలో 94,873మంది రైతులకు రూ.18.97కోట్లు అందించింది. రెండో విడతలో 94,079 మంది రైతులకు రూ.18.82కోట్లు, మూడో విడతలో 92,790మంది రైతులకు రూ.18.56కోట్లు, 2020 ఏడాది తొలివిడతలో 91,469మందికి రూ.18,29కోట్లు, ఐదో విడతలో 90,360మందికి రూ.18.07కోట్లు, ఆరో విడతలో 89,699మందికి రూ.17.94కోట్లు అందించింది. 2021 ఏడాది తొలి విడతలో 88,670మందికి రూ.17.73కోట్లు, రెండో విడతలో 87,554మందికి రూ.17.51కోట్లు, తొమ్మిదో విడతలో 86,228మందికి రూ.17.25కోట్లు, 2020 ఏడాది తొలి విడతలో 83,286మందికి రూ.16.66కోట్లు, రెండో విడతలో 79,987మందికి రూ.16కోట్లు, మూడో విడతలో 72,455మందికి రూ.14.49కోట్లు అందించింది. 2023 ఏడాది తొలివిడతలో 61,003మందికి రూ.12.20కోట్లు అందించగా.. రెండో విడతలో రైతుల సంఖ్యలో భారీగా కోత విధించింది. ఏకంగా 20వేల మంది రైతులను ఈ పథకం నుంచి తొలగించింది. తాజాగా 41,096మందికి రైతులకు కేవలం రూ.8.22కోట్లు మాత్రమే అందిస్తోంది. ఇలా రైతుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో వీరికి అనుగుణంగా అందజేసే నిధుల్లోనూ భారీగా తగ్గింపులు చేసిందని రైతులు చెబుతున్నారు.

ఈ-కేవైసీ చేయించడంలో విఫలం..!

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా లబ్ధిపొందే రైతులు తప్పనిసరిగా ఈ -కేవైసీ చేయించుకోవాలి. ఈ కేవైసీ యాప్‌లో ఆధార్ నెంబర్‌తో పట్టాపాసుపుస్తకం, సర్వే నెంబర్ వివరాలను అనుసంధానం చేసుకోవాల్సి ఉంటుంది. కానీ చాలా మంది రైతులకు ఈ విషయంపై అవగాహన లేకపోవడంతో ఈ పథకం వర్తించడం లేదని తెలుస్తోంది. రైతులతో ఈ కేవైసీ చేయించడంలో వ్యవసాయ అధికారులు అంతగా చొరవ తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఫలితంగా మారుమూల ప్రాంతాలతో పాటు ఆదివాసీ గిరిజన రైతులు అధికంగా ఉన్న ఈ జిల్లాలో వారికి సరైన అవగాహన లేని కారణంగా కేంద్రం అందించే ఈ సాయానికి దూరమవుతున్నారని తెలుస్తోంది. క్లస్టర్ల వారీగా వ్యవసాయ అధికారులు ఉన్నప్పటికీ రైతులకు అవగాహన కల్పించి పెట్టుబడి సాయం అందేలా చేయడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆ శాఖ ఉన్నతాధికారులు కూడా ఈ సమస్యపై దృష్టిసారించడం లేదని తెలుస్తోంది. మరోపక్క ఇది వరకు అధికంగా భూమి కలిగిన వారికి కూడా ఈ పథకం వర్తించగా.. తాజాగా ప్రభుత్వం పరిమితి విధించినట్లు తెలుస్తోంది. కేవలం 5 నుంచి 10 ఎకరాల్లోపు కలిగిన వారికి మాత్రమే అందజేస్తోందని తెలుస్తోంది. వీరితో పాటు వ్యవసాయ కుటుంబంలో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి ఉంటే వారిని కూడా ఈ పథకం నుంచి తొలగించినట్లు ప్రచారం జరుగుతోంది. ఫలితంగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి లబ్ధి పొందే రైతుల ఏటా గణనీయంగా తగ్గిపోయేందుకు కారణమవుతోందనే వాదన వినిపిస్తోంది. పరిమితి విధించడంతో పాటు అధికారుల అలసత్వం కారణంగా అమాయక రైతులు నష్టపోవాల్సి వస్తోందనే ఆవేదన వ్యక్తమవుతోంది.



రెవెన్యూ డివిజన్ సాధనకు ఏఐటీయూసీ మద్దతు



నవతెలంగాణ-బోథ్

రెవెన్యూ డివిజన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు ఆదివారంతో 50వ రోజుకు చేరుకున్నాయి. అందులో భాగంగా మండల కేంద్రంలోని రెవెన్యూ డివిజన్ సాధన సమితి శిబిరంలో వారియర్స్ యూత్ సభ్యులు దీక్షలో కూర్చున్నారు. వారికి మద్దతుగా బీడీ కార్మికుల సంఘం ఏఐటీయూసీ సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయాలని లేని పక్షంలో ఎన్నికలు బహిష్కరిస్తామని అన్నారు. వచ్చే ఎన్నికలలో 200 నామినేషన్లు వేస్తామని హెచ్చరించారు. అలాగే వెంటనే బోథ్‌ను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని అదేవిధంగా డిగ్రీ కళాశాల, డీఎస్పీ కార్యాలయం బోథ్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలోని సీపీఐ నాయకులు గోవర్ధన్, దాస్, సుమేర్ పాషా పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణించి ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎస్సై మనోహర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఫకీర్ గుట్ట కాలనీలో న్యాక్ ఆధ్వర్యంలో మూడో బ్యాచ్ 30 మందితో కూడిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ అభ్యర్థులకు శిక్షణ సామాగ్రిని ఎస్సై మనోహర్ అందించారు. శిక్షణ అభ్యర్థుల ఉద్దేశించి ఎస్సై మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉండాలని, ఆర్థికంగా ఎదగాలని, మహిళలు ఇలాంటి అవకాశలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం శిక్షణ అభ్యర్థులను ఎస్సై మనోహర్ ని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ దాదేరావు, సామాజిక కార్యకర్త అంజాద్ ఖాన్, న్యాక్ సిబ్బంది ఉన్నారు.

పలు గ్రామాల్లో జెడ్పీచైర్మెన్, ఎమ్మెల్యే పర్యటన



నవతెలంగాణ-నార్నూర్

ఉమ్మడి నార్నూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు పర్యటించారు. గాదిగూడ మండల కేంద్రంతో పాటు కొత్తపెల్లి సర్పంచ్ ఇటీవల మరణించడంతో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా కోఆప్షన్ సభ్యులు జాంలే బాబు అనారోగ్యంతో ఉండగా, వారిని పరామర్శించారు. ఈ నెల 10న నార్నూర్ మండలంలోని మాన్యాపూర్ గ్రామంలో నిర్వహించే పంచాయతీ భవనం, కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన విషయాలపై చర్చించినట్టు ఏఎంసీ వైస్ చైర్మెన్ తొడసం నాగోరావ్ పేర్కొన్నారు. వారి వెంట వైస్ ఎంపీపీ యోగేష్, జీవ జీవ వైవిధ్య కమిటీ సభ్యులు మర్సుకోల తిరుపతి, కొడప తుక్కుబాయి, మెస్రం శేఖర్, సర్పంచ్‌లు రాథోడ్ సావిందర్, యూర్వెత రూపదేవ్, కనక సేవంత ప్రభాకర్, రాథోడ్ గోవింద్ బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

తాంసి, భీంపూర్ మండలాల్లో భారీ వర్షం

నవతెలంగాణ-తాంసి

తాంసి, భీంపూర్ మండలాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో రైతుల్లో ఆనందం వ్యక్తం అయ్యింది. గత పదిహేను రోజుల నుంచి వర్షాలు కురువపోవడంతో పంటలకు తెగుళ్ల వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసిన రైతులు వర్షం కురియడంతో ఆనందం వ్యక్తం చేశారు. భీంపూర్ మండలంలోని కరంజి, గుబిడితో పాటు పలు గ్రామాలకు నెల రోజుల నుంచి వర్షాలు లేక పంటలు ఏదుగుదల లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం కురిసిన వర్షాలతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

నార్నూర్: రైతులు ఖరీఫ్ సీజన్‌లో వేసిన సోయా, పత్తి పంటలకు ఈ సారి వర్షాలు తక్కువ ఉండటంతో పంటలు అనుకూలంగా రాలేదని రైతులు నిరాశకు గురైయ్యారు. శనివారం నుంచి రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో మండలంలోని వివిధ గ్రామాల అన్నదాతలు హర్షం వ్యక్తం చేశారు. ఎరువులు మందులు వేసేందుకు సిద్ధమవుతున్నారు.

పిడుగుపాటుకు ఒక మృతి

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని ఎనగొంది గ్రామానికి చెందిన గోవింద్‌రావు(30) అనే వ్యక్తి పని నిమిత్తం వాంకిడి మండలకేంద్రానికి వచ్చి పనులు ముగించుకొని తిరిగి గ్రామానికి వెళ్తున్న సమయంలో మార్గమధ్యలో మలమూత్ర విసర్జనకు వెళ్లగా పిడుగుపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య పోసుబాయి, ఒక కుమార్తె తిరుమల ఉన్నారు. గోవింద్‌రావు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వాలు

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు



నవతెలంగాణ-ఉట్నూర్

నిరుద్యోగుల జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటం ఆడుతున్నాయని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు అన్నారు. ఉద్యోగ భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలనీ, అధిక ధరలను నియంత్రించాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సంతకాల సేకరణను ఆదివారం స్థానిక జగ్జీవన్ చౌరస్తాలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో యువత 65 శాతం వరకు ఉన్నారని, చరిత్రలో ఎన్నడూ లేనంత గరిష్ట స్థాయికి నిరుద్యోగం పెరిగిందన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని బీజేపీ పార్టీ ఎన్నికల్లో వాగ్దానం చేసి గెలిచిన తర్వాత ఆ హామీని విస్మరించి నిరుద్యోగులకు తీరని అన్యాయం చేస్తుందన్నారు. ఉన్నా ప్రభుత్వ రంగ సంస్థలనే ప్రయివేటీకరిస్తూ, ఉద్యోగాలకు ఎసరు తీసుకొచ్చే పని చేస్తుందని, అగ్నిపథ్ పేరుతో కాంట్రాక్టు ఉద్యోగాలను భర్తీ చేసి ఉపాధి భద్రతను దూరం చేశారని, మరోవైపు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించి దాన్ని నిర్వీర్యం చేశారని అన్నారు. నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను రోజురోజుకు పెంచుతూ సామాన్యుల నడ్డి విరుస్తున్నారని అన్నారు. కార్పొరేట్లకు దేశ సంపదను ప్రభుత్వ రంగ సంస్థలను అప్పనంగా కట్టబెడుతూ, 9 ఏండ్ల మోడీ పాలనలో రూ.100 లక్షల కోట్ల అప్పును చేసి ప్రజలపై చరిత్రలో ఎన్నడూ లేనంత ఆర్థిక భారాలను మోపరని అన్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అనేక హామీలు ఇచ్చి వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఏడాదికి లక్ష ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, నోటిఫికేషన్ల లీకేజీలతో నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం, దళిత గిరిజనులు అందరికీ మూడు ఎకరాల భూమిలాంటి హామీలను అటకెక్కించారని అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ దొరల పాలన చేస్తున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న ఉద్యోగ భర్తీకై నోటిఫికేషన్లు విడుదల చేసి భర్తీ చేసి, నిత్యావసర ధరలను తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూసం సచిన్, మండల నాయకులు మడవి నాగోరావ్, కోవ సునీల్, దుర్వ నాగోరావ్ ఉన్నారు.

నిబంధనలు పాటించని లారీలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-రెబ్బెన

పరిమితికి మించిన బొగ్గుతో తార్పాలిన్ లేకుండా నిబంధనలు పాటించని లారీలపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మైనార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఆసిఫ్ అలీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ నుండి గోలేటి సీహెచ్‌పీకి బొగ్గును తరలించే లారీలు పరిమితికి మించిన అతివేగంతో వెళ్తున్నాయన్నారు. గోలేటి నుండి ఇటు మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్‌కు నిత్యం ప్రజలు ప్రయాణిస్తున్నారని, బొగ్గు టిప్పర్లు నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారని ఆయన తెలిపారు. బొగ్గును తరలించే క్రమంలో లారీల్లో ఓవర్ లోడ్ వేసుకొని వాటిపై టార్పాలిన్ కప్పకుండా నడపడంతో వెనుక వచ్చే వాహనదారుల కండ్లలో బొగ్గు చుర పడి ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఓవర్ లోడ్‌తో ప్రయాణించడంతో స్పీడ్ బ్రేకర్ల వద్ద బొగ్గు పెళ్లలు క్రిందపడి ప్రక్కన వెళ్లే ప్రయాణికు లు ప్రమాదాలు జరిగి ప్రాణాలు సైతం కోల్పోయిన ఘటనలు అనేకం ఉన్నాయని తెలిపారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని, ప్రమాదం జరిగినప్పుడు తూతూమంత్రంగా హడావుడి చేసి వదిలేస్తున్నారు కానీ శాశ్వత పరిష్కారం చూపించడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. అంతేకాకుండా టిప్పర్ల డ్రైవర్లు హారన్ ఏకతాటిగా కొట్టుకుంటూ ప్రజలకు నిద్ర లేకుండా చేస్తున్నారన్నారు. గోలేటి బస్టాండులో పాఠశాల విద్యార్థులు ఎక్కే బస్సులకు అడ్డుగా ఉంచి పిల్లలు ఎక్కడానికి వీలులేకుండా లారీలు బస్టాండులో క్రమం లేకుండా పెడుతున్నారని తెలిపారు. గోలేటి సీహెచ్‌పీ వద్ద అన్‌లోడింగ్ చేసే లారీలు ప్రధాన రహదారిపైకి వచ్చే క్రమంలో అటూ ఇటూ చూడకుండా ఏకతాటితో రోడ్డుపైకి వచ్చేస్తున్నారు. దీనివల్ల ఎన్నో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున దీనిని గమనించి అధికారులు లారీలను వేరే దారికి మళ్లించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

టికెట్ దక్కేదేవరికి..? పోటీలో నిలిచేదేవరు..?

- ప్రతిపక్ష నాయకుల గుండెల్లో గుబులు
- టికెట్ల కేటాయింపుపై స్తబ్దత...'బి' ఫాంపై నాయకుల్లో ఆశాభావం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అధికార బీఆర్ఎస్ ఇప్పటికే 115 నియోజకవర్గాల్లో అభ్యర్థుల్ని ప్రకటించి ఎన్నికలకు సన్నద్ధమైంది. అయితే అధికార పార్టీలో సీటు లభించని ఆశావహులు, సిట్టింగులు ప్రతిపక్ష పార్టీల టికెట్ ఆశించడం, ఎప్పటి నుంచో ప్రతిపక్ష పార్టీలలో కొనసాగుతున్న వారు తమకే అవకాశం దొరకకుండా పోతుందా అని ఎదురు చూస్తున్నారు. ఈ సారి రానున్న ఎన్నికల్లో టికెట్ లభించేదేవరికి.....? పోటీలో నిలిచేదెవరు అనేది ఇప్పుడు సర్వత్ర చర్చనీయాంశమైంది.

బరిలో నిలిచేదెవరు.

ప్రతిపక్షాల్లో ఇప్పటికే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో పోటీ పెరిగింది. ప్రతిచోట కాంగ్రెస్, బీజేపీతో పాటు బీఎస్పీ టికెట్ ఆశించే వారి సంఖ్య కూడా రోజురోజుకు పెరుగుతుంది. తూర్పు జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీలో మంచిర్యాల, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో టికెట్‌పై కొంత స్పష్టత వచ్చినప్పటికీ, మిగతా నియోజకవర్గంలో పోటీలో ఎవరు ఉంటారనేది ఇంకా తెలియ రాలేదు. బీజేపీలో కూడా అదే పరిస్థితి కనిపిస్తుంది. అయితే అధికారంలో మేమంటే మేము అంటూ ధీమా వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీలు ఇంకా అభ్యర్థులను ఖరారుచేయలేదు. టికెట్‌పై ఎవరి ధీమా వారికే ఉంది. ఈ విషయమే ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్, బీజేపీ శ్రేణులకు అయోమయానికి గురి చేస్తుంది.

టికెట్ల కేటాయింపులో స్తబ్దత

ప్రతిపక్ష నాయకులు ఇప్పటికే ప్రచారంలో ప్రజల్లో ఉన్నప్పటికీ టికెట్ ఎవరికి దక్కుతుందనే విషయంపై ఒక అంచనాకు రాలేకపోతున్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నుండి శ్యామ్ నాయక్, మర్సుకోల సరస్వతి, గణేష్ రాథోడ్, కాగజ్‌నగర్ నియోజకవర్గంలో రావి శ్రీనివాస్‌తో పాటు, కోరేశ్వ కష్ణ రెడ్డి, బెల్లంపల్లి నుండి గడ్డం వినోద్‌కు టికెట్ దాదాపు ఖాయమైనప్పటికీ మరింతమంది పోటీలో ఉన్నారు. మంచిర్యాలలో కూడా ప్రేమ్ సాగర్ రావు కు దాదాపు ఖాయమైనప్పటికీ చివరి క్షణంలో ఏదైనా జరిగితే తమకు అవకాశం రాకపోతుందా అని పార్టీల నాయకులు కూడా ఎదురుచూస్తున్నట్లు తెలిసింది. చెన్నూర్‌లో కూడా రాజా రమేష్, దుర్గం అశోక్‌తో పాటు మరింత మంది పోటీపడుతున్నారు. బీజేపీలో కూడా ఆసిఫాబాద్‌లో ఆత్మరాం నాయక్, కొట్నాక విజయ్ కాగజ్‌నగర్‌లో పాల్వాయి హరీష్ బాబు, కొత్తపెల్లి శ్రీనివాస్, బెల్లంపల్లిలో హేమాజీ ప్రయత్నాలు చేస్తున్నారు. టికెట్ తమకే వస్తుందని చెబుతూ ప్రజల్లో మమేకం అవుతున్నారు. టికెట్ ఎవరికి వచ్చిన గెలుపే లక్ష్యంగా పని చేయాలనే యోచనతో ఈ రెండు పార్టీలు ముందుకు సాగుతున్నట్లు తెలిసింది. అయితే కొంత అసంతృప్తి నేతల నుంచి ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధిష్టానం చూడాలని కార్యకర్తల నుంచి ఓ విన్నపం వస్తున్నట్లు చెప్పావచ్చు.

బీఫాంపై ఎవరి ధీమా వారిదే.

ఇప్పటికే ప్రజల్లో ఉంటూ ప్రచారానికి వెళ్తున్న నాయకులు ప్రతిపక్ష పార్టీలకు సంబంధించి బి ఫాం తమకి వస్తుందని ధీమాతో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ ఈనెల 15 వరకు మొదటి లిస్టు ఇవ్వనుండగా, బీజేపీ ఇంకా తుది కసరత్తుపై దృష్టి పెట్టలేదు. అయితే ఎవరికి వారుగా తమకే బిఫాం వస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. దీంతో కింది స్థాయి కెడర్‌లో గందరగోళం నెలకొంది. ఏ నాయకుడికి టికెట్ వస్తుంది, ఎవరి కోసం పనిచేయాలో తెలియని స్థితిలో ఉన్నారు.

నా భూమి నా దేశం కార్యక్రమానికి శ్రీకారం

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని రెబ్బెన గ్రామంలో మారెమ్మ దేవాలయం వద్ద ఆదివారం మధ్యాహ్నం నా భూమి నా దేశం కార్యక్రమంలో భాగంగా మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ ప్రధానీ నరేంద్ర మోడీ పిలుపు మేరకు ప్రతి ఇంటి నుండి పిరికెడు మట్టిని సేకరించి ఢిల్లీకి తరలించి అక్కడ ఆజాదికా అమృత్ మహోత్సవం సందర్భంగా అమృతవన నిర్మాణం కోసం పంపించడం జరుగుతుందని, మండలంలోని రెబ్బెన గ్రామంలో ఆదివారం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. ప్రతి భారత పౌరుడు తన ఇంటి నుండి పిరికెడు మట్టిని తరలించే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, తద్వారా అమరవీరుల స్మారకార్థం నిర్వహించే ఈ అమృతవన నిర్మాణంలో పాలుపంచుకోవాలని పిలుపునివ్వడం జరిగింది. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఉమ్మెర బాలకృష్ణ, మాజీ జడ్పీటీసీ ఎల్ములె మల్లయ్య, సర్పంచ్ కారెం సతీష్, వెంకటేష్, ఎడ్ల శంకర్, బూడిద భీంరావు, మాజీ ఎంపీటీసీ తాళ్ల రామయ్య, కోల కృష్ణయ్య, ఉమ్మరి తిరుపతి, శోభాన్, దుబ్బుల దిలీప్, బసీఉల్లాఖాన్, బెనికి శ్యాంసుందర్, గట్టు తిరుపతి, జునుగరి మధూకర్, శంకర్‌గౌడ్, బండి ప్రభాకర్, ఎలుకరి సంజీవ్, బొమ్మె రమేష్, కుడుక రమేష్, కొడిపె భిక్షపతి, పవన్ పురోహిత్, స్వామి, నాందేవ్, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



అమ్మవారి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు

నవతెలంగాణ-బాసర

సరస్వతిదేవి అమ్మవారిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి సురేపల్లి నంద అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న వీరిని ఆలయ అధికారులు అర్చకులు మంగళ వాయిద్యాలతో పూర్ణకుంభతో స్వాగతం పలికారు. అమ్మవారి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి సురేపల్లి నందచే ఆలయ స్థాన చార్యులు ప్రవీణ్ పాటక్, ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి ప్రత్యేక



కుంకుమార్చన పూజలు జరిపించి హారతి నిచ్చి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అమ్మవారి చరిత్ర ఆలయ విశిష్టతను వివరించారు. హైకోర్టు న్యాయమూర్తిని పట్టు వస్త్రాలతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక వంశీయులు శరత్ పాటక్, ఏఈఓ సుదర్శన్‌గౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కడెం

ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తమ విలువైన ఓటును తప్పక సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని 167వ పోలింగ్ కేంద్రాన్ని మండలంలోని కొండుకూర్, ధర్మాజీపేట్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి సంబంధిత రిజిస్టర్‌లను పరిశీలించి, మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండి ఉండి ఓటు హక్కు లేని వారు వెంటనే ఆయా గ్రామాల్లో ఉన్న బీఎల్ఓల వద్ద ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కోరారు. అలాగే రానున్న ఎన్నికలలో ప్రతి ఓటరు తమ విలువైన ఓటును తప్పక వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరి, కొండుకూర్ సర్పంచ్ గొల్ల వేణుగోపాల్ బీఎల్ఓలు గంగామణి, భాగ్యరేఖ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ధర్నాలు



నవతెలంగాణ-నిర్మల్

కేంద్ర, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ, అధిక ధరలు, నిరుద్యోగ ఉపాధి కుదింపునకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 5న తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా, సెప్టెంబర్ 7న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ అన్నారు. ఆదివారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దేశంలో రోజురోజుకు నిత్యవసర సరుకుల ధరలు హద్దు అదుపు లేకుండా పెరిగిపోతున్నాయని అన్నారు. బియ్యం ధరలకు రెక్కలు వచ్చాయని అన్నారు. పప్పు ధరలు కొండెక్కాయని, కూరగాయలు నూనె ధరలు ఆకాశం అంటుతున్నాయని అన్నారు. దేశంలో కోట్లాది మంది ప్రజలు పేదరికంలో మగ్గుతున్నారని, వీరిపై పన్నుల భారం పెంచి మరింత దరిద్ర్యంలోకి నెట్టుతున్నారని విమర్శించారు. నిత్యావసర సరుకుల ధరలు 2014లో ఉన్న ధరలు పరిశీలిస్తే నేడు 50 శాతం నుండి 200 శాతం వరకు సరుకుల ధరలు పెరిగాయని అన్నారు. కూరగాయల ధరలు ఈ నెలలోనే 37 శాతం వరకు పెరిగాయన్నారు. పప్పులు 40 శాతం పెరిగాయని, బియ్యం ధరలు కేజీకి 60 చేరిందని, గ్యాస్ ధరలు నేటికీ 1200 చేరిందన్నారు. విద్యావైద్యం కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సిన రావడంతో ప్రజలు అప్పు చేస్తూ వడ్డీ కోరల్లో చిక్కుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందని అన్నారు. 2006లో అటవి హక్కు చట్టం ప్రకారం 11.5లక్షల ఎకరాలకు హక్కుపత్రాలు ఇస్తామని కేవలం 4లక్షల ఎకరాలకు మాత్రమే ఇచ్చారని విమర్శించారు. దళితులకు గిరిజనులకు మూడెకరాల భూమి ఇవ్వలేదన్నారు. కార్మికుల కనీస వేతనాలు సవరించలేదన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మాణం పక్కనపెట్టి కొత్తగా గృహలక్ష్మి పథకం తెచ్చారని తెలిపారు. అది కూడా అర్హులకు అందే అవకాశం లేదన్నారు. రాష్ట్రంలో 16 లక్షల మంది కౌలు రైతులకు 2011 చట్టం ప్రకారం రుణహరత కార్డు ఇచ్చి రుణమాఫీ చేయాలన్నారు. పేదలు సామాన్య మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితుల నేపథ్యంలో తక్షణమే ప్రజల సమస్యలు పరిష్కరించి, ప్రజలను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొమ్మెన సురేష్, నిర్మల్ డివిజన్ కమిటీ నాయకులు ఫాసిద్దీన్, క్లేమేంట్ వెస్లీ, డి.పోశెట్టి పాల్గొన్నారు.

ప్రజలను మోసగిస్తున్న బీజేపీ ప్రభుత్వం

నవతెలంగాణ-ఖానాపూర్

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజలను మోసగిస్తుందని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బాణావత్ గోవింద నాయక్ అన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజావ్యతిరేక విధానాలతో ధరలు పెరుగుతున్నాయని అన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ వంట గ్యాస్ రేటు రూ.1250 రేట్లు పెంచి ప్రజలపైన భారాలు మోపిందన్నారు. 2014లో వంట గ్యాస్ ధర రూ.410 ఉండేదని, 10 సంవత్సరాలలో గ్యాస్ ధర రూ.1950 వరకు పెంచి ఇప్పుడు తగ్గించామని గొప్పలకు పోతున్నారని అన్నారు. నిత్యవసర సరుకులు విపరీతంగా పెంచి ప్రజలకు కొనుక్కోలేని పరిస్థితి తెచ్చింది అన్నారు. ఈ మధ్యకాలంలో టమాటా రూ. 200 కార్పొరేట్ సంస్థలు పెంచారని అన్నారు. రైతుల దగ్గర ఉన్నప్పుడు ఎటువంటి రేటు ఉండదని కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి రాగానే ధరలు పెరుగుతున్నాయని అన్నారు. బీజేపీ ప్రభుత్వం దళారులు కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ధరలు పెంచుతున్నారని ఆయన అన్నారు.

ఖానాపూర్‌లో భారీ వర్షం

- తర్లపాడు రోడ్డుపై విరిగిపడ్డ చెట్టు

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్‌లో ఆదివారం కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని గాంధీనగర్, తర్లపాడు వెళ్లే రోడ్డుపై భారీ వృక్షం విరిగిపడింది. దీంతో రాకపోగాలకు ఇబ్బంది కాగా ఖానాపూర్ మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్ స్పందించి జేసీబీ సాయంతో రోడ్డుపై నుంచి తొలగించారు. అంతేకాకుండా పట్టణంలోని డ్రైనేజీలు నిండుకుని జలమయమయ్యాయి. రెండు గంటల పాటు కురిసిన భారీ వర్షానికి డ్రైనేజీలు నిండుకుని వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. మున్సిపల్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, పాత బస్టాండ్ సమీపంలో రోడ్లు జలమయం అయ్యాయి.

దామోదర రాజనర్సింహను కలిసిన రాథోడ్ పార్వతి



నవతెలంగాణ-ఇచ్చోడ

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహను బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు రాథోడ్ పార్వతి ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గం కాంగ్రెస్ మొదటి గిరిజన మహిళా విద్యావంతురాలినని అన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఉద్యోగాన్ని సైతం త్యాగం చేసి, ఎన్‌జీఓ ద్వారా నియోజకవర్గంలో సొంత డబ్బులతో అనేక సేవా కార్యక్రమాలు చేస్తూన్నాని అన్నారు. అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందుతున్నామని అన్నారు, మన బోథ్ గడ్డ ఆడబిడ్డగా,అభ్యర్థతత్వాన్ని అందరు అమోదిస్తూ మొదటి గిరిజన మహిళకు ఈసారి బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ నుంచి అవకాశం ఇస్తారని భావిస్తున్నట్లు తెలిపారు. ఆమె వెంట బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-నేరడిగొండ



మండలంలోని వడూరు గ్రామానికి చెందిన భామని కిషన్, అదే గ్రామానికి చెందిన దొంతు శ్రీనులు ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందారు. ఆదివారం విషయం తెలుసుకున్న బోథ్ నియోజవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ బాధితుల ఇంటికి వెళ్లి పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఇరు కుటుంబాలకు రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా మండలంలోని బోందిడి గ్రామానికి చెందిన శేషారావు తల్లి, రాథోడ్ జమున బాయి, ఇటీవల మరణించారు. వాగ్దారి గ్రామానికి చెందిన రామారావ్ భార్య సరోజ అనారోగ్యం మరణించిన విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు జహీర్, వడూరు ఎంపీటీసీ పండరి, శంకర్ ఉపసర్పంచ్ శ్రీకాంత్ యాదవ్, రమేష్‌లు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో కూలి మృతి

నవతెలంగాణ-బోథ్

విద్యుద్ఘాతంతో కూలి మృతి చెందిన సంఘటన మండలంలోని పొచ్చెర గ్రామంలోని ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సారంగాపూర్ ధని గ్రామానికి చెందిన శేఖర్ 33 కేవీ విద్యుత్ తీగెలకు తగిలి మృతి చెందాడు. మృతుడు గత వారం రోజులుగా పొచ్చెర గ్రామానికి చెందిన బంధువుల ఇంటికి వచ్చి అదే గ్రామానికి చెందిన రమేష్ నూతన ఇంటి నిర్మాణ పనికి వెళ్లారు. ఇంటి స్లాబ్ పని చేస్తుండగా అకస్మాత్తుగా తన చేతుల్లో ఉన్న తాపీ ఇంటిపై నుంచి ఉన్న 33 కేవీ విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాము తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-బోథ్

ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఆదివారం మండలంలోని సొనాల గ్రామ సమీపంలో బోథ్ బైపాస్ రోడ్డు ప్రక్కన సాకేర నుంచి సొనాలకు వెళ్తున్న అనిల్, సొనాల నుంచి సాకేరకు వెళ్తున్న రాజశేఖర్‌లు రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో బోథ్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇద్దరు క్షేమంగా ఉన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఏజెన్సీలోని దళితుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఉట్నూర్



ఏజెన్సీలోని దళితుల సమస్యలు పరిష్కరించాలని ఏజెన్సీ దళితులు అన్నారు. ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదిలాబాద్‌లోని ఓ శుభ కార్యాయానికి వెళ్లే దారిలో ఆదివారం మండలంలోని ఎక్స్ రోడ్డులోని ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మెన్ జాధవ్ శ్రీరాం నివాసంలో కాసేపు సేద తీరారు. మంత్రి ఉట్నూర్‌కి వచ్చిన విషయం తెలుసుకున్న దళిత సంఘ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు అక్కడికి చేరుకుని మంత్రిని సన్మానించారు. అనంతరం ఏజెన్సీలోని దళితులు ఎదుర్కొంటున్నా సమస్యలపై విన్నవించి వినతిపత్రం అందజేశారు. ఏజెన్సీ దళిత సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. దళితులు సాగు చేస్తున్న భూములకు హక్కులు లేవన్నారు. కేవలం ఓట్ల కు తప్ప దేనికి అర్హతగా లేమని అన్నారు. ఏజెన్సీ ఏరియాలలో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు మిగితా నియోజకవర్గాలకంటే అదనంగా మంజూరు చేసి అభివృద్ధి చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్‌ని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని ప్రతి కార్యకర్త కంకణబద్దులై ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంద్రవెల్లి ఏఎంసీ చైర్మెన్ శ్రీరామ్ జాదవ్, ఉట్నూర్ వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, సర్పంచ్ హరి నాయక్, అంబేద్కర్ అసోసియేషన్ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు జగ్జీవన్, కాంబ్లె ప్రజ్ఞశీల్, నాయకులు స్వామి, జాడి వెంకటేష్ ఉన్నారు.

చట్టాలపై అవగాహన కల్పించేందుకే న్యాయ విజ్ఞాన సదస్సు



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించడానికి న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్టు బోథ్ జడ్జి బి.హుస్సేన్ తెలిపారు. ఆదివారం మండలంలోని మడాగూడ గ్రామంలోని గిరిజన బాలికల పాఠశాలలో విద్యార్థులకు, గ్రామస్తులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సంధ్బంగా జడ్జి బి.హుస్సేన్ మాట్లాడుతూ రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించిందని, హక్కులతో పాటు బాధ్యతలను విధిగా నెరవేర్చాలని అన్నారు. విద్యార్థులు బాల్యం నుండే చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అందులో భాగంగా విద్యార్థులకు బాలకార్మిక నిర్మూలన, విద్యాహక్కు చట్టం, లైంగిక వేధింపులు, మోటారు వెహికల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టాలు కోర్టు పరిధిలో జరిగే విషయాలు గురించి, అవగాహన కల్పించారు. భ్రూణ హత్యలు చేయరాదని, బాలలను కార్మికులుగా మార్చి శ్రమ దోపిడీకి పాల్పడొద్దని అన్నారు. గర్భస్థ శిశువు పిండ నిర్ధారణకు పూనుకుంటే, మానవ అక్రమ రవాణా చేస్తే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. వయోవృద్ధుల సంక్షేమ చట్టం, గిరిజనుల హక్కులు, ఆస్తి హక్కు, జాతీయ ఆహార భద్రత చట్టంపై న్యాయం గురించి అవగాహన కల్పించారు. అనంతరం చింతల సాంగ్వీ గ్రామానికి చెందిన సిడం ప్రవళిక వైద్యవిద్య కళాశాలలో సీటు సాధించిన సందర్భంగా ఆమెకు శాలువాతో సత్కరించి, మెమోంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ప్రకాష్, సీఐ భీమేష్, ఎస్సై నరేష్, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలి

- బోథ్ సీఐ భీమేష్

నవతెలంగాణ-బోథ్



రోడ్డుపై భద్రత మన అందరి బాధ్యతని బోథ్ సీఐ భీమేష్ అన్నారు. మండలంలోని కౌటా(బి) గ్రామాభివృద్ధికి ఆదివారం అంతర్‌రాష్ట్ర రహదారిపై సూచిక బోర్డు సీఐ భీమేశ్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎలా గ్రామస్తులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అలాగే గ్రామాభివృద్ధి కమిటీ వారిని అభినందించారు.. గ్రామాల్లో యువత, ప్రజలు రోడ్డుపై మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, రోడ్డు ప్రమాదం కేవలం మరణమే కాదని శాశ్వతంగా కుటుంబాన్ని సైతం రోడ్డు పైకి తెస్తుందన్నారు.అలాగే ప్రతి ఒక్కరు.జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామాల్లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. ప్రమాదాల భారిన పడకుండా చేసే కార్యక్రమలైన పోలీసుల సహకారం ఎల్లవేళల ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు గడుగు శంకర్, సర్పంచ్ రాధికా గంగాధర్, ఉపసర్పంచ్, చిలకడి రవి, వీడీసీ సభ్యులు మల్లెపూల గంగయ్య, మల్లెపూల ప్రసాద్, హకీం, మాజీ ఎంపీటీసీ సభ్యులు శ్రీధర్ పాల్గొన్నారు.

ఎన్‌ఎచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్‌ఎచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్ అన్నారు. ఆదివారం ఎన్‌ఎచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తు, రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం ఎన్‌ఎచ్‌ఎం ఉద్యోగుల సమ్మె ప్రారంభం అవుతుందని అన్నారు. అందుకు ముందస్తు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఎచ్‌ఎంలను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో ఎన్‌ఎచ్‌ఎం ఉద్యోగులు పాల్గొని, సమ్మెను విజయవంత చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, ఎన్‌ఎచ్‌ఎం ఉద్యోగులు కిరణ్, విజయ్, నీల, రనిత, స్రవంతి, విష్ణు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్న వాల్గోట్ కిషన్



నవతెలంగాణ-ఖానాపూర్

నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని ప్రాథమిక పాఠశాల, పాతఎల్లాపూర్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు వాల్గోట్ కిషన్‌కు ఆదివారం నల్గొండ జిల్లా కేంద్రానికి చెందిన పుడమి సాహితీ సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ తెలంగాణ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. నల్గొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డును ప్రధానం చేశారు. గత రెండున్నర దశాబ్దాలుగా చేస్తున్న విద్య, సామాజిక సేవలకు గాను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును భక్త రామదాసు 10వ వారసుడు కంచర్ల శ్రీనివాస్‌రావు, ప్రముఖ కవి శ్రీనాథుడు 13వ తరం వారసుడు డాక్టర్ కావూరి శ్రీనివాస శర్మ, ప్రముఖ కవి మొల్లవారి 14వ తరం వారసుడు మున్నేళ్ల శివశంకరయ్య, ప్రముఖ కవి గిడుగు రామ్మూర్తి 4వ తరం వారసుడు గిడుగు వెంకట నాగేశ్వర్‌రావు ప్రముఖులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పుడమి సాహితీ వేదిక ఫౌండర్, జాతీయ అధ్యక్షుడు శ్రీ చిలముల బాల్‌రెడ్డి, టీచర్లు, సన్మాన గ్రహీతలు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం కేసు నమోదు

నవతెలంగాణ-సారంగాపూర్



మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన మహిపాల్‌రెడ్డి(37) అదృశ్యమయ్యాడు. ఆగస్టు 11న పొలానికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు సాయంత్రం అయినా ఇంటికి రాలేదు. తన ఫోన్ స్విచ్ ఆఫ్ అయ్యింది. ఇలాగే గతంలో రెండు సార్లు ఇంటినుండి వెళ్లి తిరిగి వచ్చాడు. ప్రస్తుతం నెల రోజులైనా ఇంటికి రాకపోవడంతో భార్య లత ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కృష్ణా సాగర్‌రెడ్డి తెలిపారు.

రాజ్యాధికార సాధనే లక్ష్యం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సామాజిక, సంక్షేమాభివృద్ధితో పాటు రాజ్యాధికార సాధనే లక్ష్యంగా పద్మశాలీలు అడుగులు వేస్తున్నారు. పంచాయతీ నుంచి పార్లమెంటు దాకా రాజకీయ వాటా సాధిద్దామనే నినాదంతో నిర్వహిస్తున్న పద్మశాలి శంఖారావం కార్యక్రమానికి పద్మశాలీలు ఆదివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండలాల నుంచి హైదరాబాద్ సరూర్‌నగర్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రాంగణంలో నిర్వహిస్తున్న పద్మశాలి శంఖారావాని తరలివెళ్లారు. తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్, జక్కుల సత్యనారాయణ, ఆదిలాబాద్ తాలూకా పద్మశాలి సంఘం అధ్యక్షులు బొమ్మకంటి రమేష్, ప్రధాన కార్యదర్శి చిలుక విలాస్, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ప్రచార కార్యదర్శి జిట్ట రమేష్, ఆదిలాబాద్ జిల్లా పద్మశాలి సంఘం కోశాధికారి బాస దత్తు, ఉపాధ్యక్షులు పెంట వెంకన్న, తెలంగాణ చేనేత ఐక్యవేదిక ఉపాధ్యక్షులు దాసరి రమేష్, రాష్ట్ర కార్యదర్శి మోర ఆశన్న, జిల్లా అధ్యక్షులు అలిశెట్టి నాగన్న, ఆదిలాబాద్ రూరల్ మండల అధ్యక్షులు అనుముల ఉశన్న (కాటన్), పోపా ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెట్‌పెల్లివార్ శ్రీధర్, సలహాదారులు డాక్టర్ మెట్‌పెల్లివార్ శ్రీకాంత్, కోశాధికారి పెంట చంద్రమోహన్, కుల బాంధవులు బయలుదేరారు.

బీజేపీలో చేరిన కొండ్రు మహేష్‌రెడ్డి

నవతెలంగాణ-సారంగాపూర్

మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కొండ్రు మహేష్‌రెడ్డి, సాయికుమార్ ఆదివారం బీజేపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. మహేశ్వర్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కరిపే విలాస్, నాయకులు సామల వీరయ్య, లక్ష్మణ్, సాహెబ్‌రావ్, సత్యం, చంద్రకాంత్ పాల్గొన్నారు.

హైవే అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు నష్టం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

హైవే అధికారుల పట్టింపు లేని తనంతో రైతులకు నష్టం జరుగుతోంది. వివరాల్లోకి వెళితే ఆసిఫాబాద్ మండల పరిధిలో నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో భాగంగా 15 చోట్ల వట్టివాగు కుడి కాలువను రహదారి దాటింది. అయితే రహదారి నిర్మాణంలో భాగంగా కాలువలో హైవే నిర్మాణం చేస్తున్నవారు మట్టి వేయడంతో పలుచోట్ల కిందికి నీరు వెళ్లే పరిస్థితి లేదు. డి.8 కాల్వ వద్ద నీరు నిలిచిపోవడంతో పాటు కాలువ తెగిపోవడంతో నీరు వృధా అవుతుంది. ఈ విషయాన్ని రైతులు ఇరిగేషన్ అధికారులు నేషనల్ హైవే అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదని తెలిసింది. ఇదే విషయాన్ని ఇరిగేషన్ ఏఈ షేక్ జానీని వివరణ అడుగగా కాల్వ తెగిపోయిందని కిందికి నీరు వెళ్లడం లేదన్నారు. హైవే అధికారులు వెంటనే మరమ్మతులు చేయాలని కోరామని తెలిపారు. అధికారులు స్పందించి కాలువలలో వేసిన మట్టి తొలగించి పూడికలు తీసివేసి కిందికి నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కాంగ్రెస్ బూత్ లెవెల్ సభ్యుల నియామకం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



కాంగ్రెస్ పార్టీ బూత్ సభ్యుల నియామకంలో భాగంగా మండలంలోని చిర్రకుంటలో ఆదివారం నియామక ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బూతు స్థాయిలో ఓటర్లను గుర్తించి వారిని ఎప్పటికప్పుడు చైతన్య పరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎండి ఆసిఫ్ అలీ, పార్టీ మండల అధ్యక్షుడు మసాడే చరణ్, నాయకులు దీపక్, షేక్ అసద్, మాజీ ఎంపీటీసీ మొండయ్య, కొయ్యల పాండు పాల్గొన్నారు.

మందమర్రి ఘటనలో దుండగులను శిక్షించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మందమర్రి యాపల్ ప్రాంతంలో మేకలు దొంగతనం చేశాడని ఆరోపణతో దళిత యువకుడు కిరణ్‌ను కాళ్లు పైకి తల కిందికి చేసి చెట్టుకు కట్టేసి కొట్టిన చాకలి రాములుతో పాటు ఇతరులపై చర్యలు తీసుకోవాలని వారిని శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. దళిత యువకుడు కిరణ్‌తో పాటు మేకల కాపరి తేజను చిత్రహింసలకు గురి చేయడం దారుణమని వాళ్ల డబ్బులు ఇస్తామని ఒప్పుకున్నప్పటికీ యజమాని చిత్రహింసలకు గురి చేశాడని ఆరోపించారు. ఈ సంఘటనకు బాధ్యులైన ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే బాధితుల పక్షాన పోరాటం చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు.

కాగజ్‌నగర్‌లో భారీ వర్షం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్ పట్టణం, రూరల్ మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. శనివారం సాయంత్రం నుంచి ప్రారంభమైన వర్షం నిరవధికంగా ఓ మోస్తరుగా కురుస్తూనే ఉంది. ఉదయం నుంచి మోస్తరు చిరుజల్లులు కురియగా రాత్రి ఒక్కసారిగా భారీ వర్షం పడింది. ఇండ్లలోకి నీరుచేరి పట్టణవాసులు అవస్థలు పడ్డారు. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు, రోడ్లన్నీ జలమయం అయ్యాయి. డ్రెయినేజీ నీరు రోడ్లపై ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. గత కొద్ది రోజులుగా ఉక్కపోత ఉండగా ఈ భారీవర్షం కాస్త ఊరటనిచ్చినట్లయ్యింది. కొద్ది రోజులుగా వర్షం కురవక వేసవిని తలపించింది. వర్షం కురుస్తుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు వర్షాలు లేక పంటల పరిస్థితిపై ఆందోళనలో ఉన్న రైతులకు వర్షం ఊరటనిచ్చింది.

ఆసిఫాబాద్ కాంగ్రెస్ టికెట్ ఆదివాసులకు కేటాయించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్‌ను ఆదివాసుల కేటాయించాలని నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇది వరకు ఉమ్మడి జిల్లాలోని బోథ్, ఖానాపూర్ టికెట్లు వేరే సామాజిక వర్గానికి వెళ్లాయని అన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గం టికెట్ ఆదివాసీలకే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై జిల్లా అధ్యక్షులు సానుకూలంగా స్పందించి తప్పకుండా ఈ విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి ఆదివాసీలకే టికెట్ కేటాయించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఆదివాసీ జిల్లా చైర్మెన్ కుడిమేత విశ్వనాథరావు, ఆయా మండలాల ఆదివాసీ సంఘాల నాయకులు కుర్సెంగ నగేష్, జగన్నాథరావు, రాము, ప్రభాకర్, లింగు పాల్గొన్నారు.

నేడు మెగా డీఎస్సీ కోసం ధర్నా



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నిరుద్యోగ శిక్షణ ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్న మెగా డీఎస్సీ కోసం సోమవారం నిర్వహించే ధర్నా విజయవంతం చేయాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎండి ఆసీఫ్ అలీ కోరారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులు మెగా డీఎస్సీ కోసం ఆశగా ఎదురుచూస్తున్నారని, కానీ దానికి విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం అతి తక్కువ పోస్టులు ప్రకటించడం దారుణమన్నారు. వెంటనే 25వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు అండగా ఉండి పోరాడుతామన్నారు. ప్రస్తుతం చేపడుతున్న పదోన్నతుల్లో ఏర్పడే ఖాళీలను డీఎస్సీలో చూపాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం నేడు జిల్లా కేంద్రాల్లోని అంబేద్కర్ చౌక్ వద్ద చేపట్టేలో ధర్నాలో డీఎస్సీ అభ్యర్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చరణ్, సోషల్ మీడియా కన్వీనర్ దీపక్, మైనార్టీ నాయకుడు షేక్ అసద్ పాల్గొన్నారు.

తిరుమలలో కోనేరు చిత్రపటం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ఈజ్‌గాం గ్రామానికి చెందిన బైరగొని రాజు తిరుమల తిరుపతి ఆలయ ఆవరణలో సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చిత్రపటాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేపై అభిమానంతో ఏడుకొండల వెంకటేశ్వర స్వామి సన్నిధిలో చిత్రపటాన్ని ప్రదర్శించినట్టు తెలిపారు. సిర్పూర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే కోనేరు కోనప్పను సీఎం కేసీఆర్ ప్రకటించిన సందర్భంగా రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో ఘనవిజయం సాధించాలని కోరారు. గెలిచిన మరుక్షణం మళ్లీ స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించకుంటానని తెలిపారు.

జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు

- అడ ప్రాజెక్టు ఒక గేటు ఎత్తివేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్



గత నెల రోజులుగా ఒక్క చినుకు వర్షం పడకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో శనివారం రాత్రి నుంచి జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా వర్షాలు కురుస్తున్నాయి. దీనితో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో వర్షాభావంతో చాలాచోట్ల ఇప్పటికే వరి పంట రైతులు వేయలేదు. వర్షంపైన ఆధారపడి వేసిన పత్తి పంట కూడా గత నెల రోజులుగా వర్షం లేకపోవడంతో పురుగు పడుతూ చెడిపోయే ప్రమాదానికి చేరింది. ఈ దశలో వర్షం కురవడంతో రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అడ ప్రాజెక్టు గేట్ ఎత్తివేత

శనివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షంతో అడ ప్రాజెక్ట్ గేట్ ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. అధికారులు సాయంత్రం వరకు 5 నెంబరు గేటును 0.30 మీటర్లు ఎత్తి 641 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటిమట్టం 243 మీటర్లు కాగా సాయంత్రం వరకు 237.650 మీటర్లకు చేరుకొంది. ప్రాజెక్టు సామర్థ్యం 10.393 టీఎంసీలు కాగా ఇప్పటివరకు 5.809 టీఎంసీలకు చేరుకుంది. ఇన్ ఫ్లో 641 క్యూసెక్కులుగా ఉండగా ఒక గేటు ఎత్తి అంతే మొత్తంలో కిందికి వదులుతున్నారు.

జిల్లాలో వర్షపాతం వివరాలు

జిల్లాలో శనివారం రాత్రి నుంచి జిల్లా వ్యాప్తంగా వర్షం కురియగా అధికారుల లెక్కల ప్రకారం శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు జిల్లాలో సగటు 18.9 మిల్లీ మీటర్ల వర్షపాతం కురిసింది. మండలాల వారీగా కురిసిన వర్షపాతం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జైనూర్‌లో 12 మీ.మీ. వర్షపాతం కురియగా సిర్పూర్ (యు) 44.8, లింగాపూర్ 43.2, తిర్యాని 9.2, రెబ్బెన 11.4, ఆసిఫాబాద్ 7.6, కెరమెరి 12.4, వాంకిడి 37, కాగజ్‌నగర్ 11.2, సిర్పూర్(టి)లో 10.2, కౌటాల 2.8, చింతలమానపెల్లి 1.6, బెజ్జూర్ 74, పెంచికలపేట 2.8, దహేగాం 3.0 మీ.మీల వర్షపాతం కురిసింది.

కౌటాల : గత వారం రోజులుగా సూర్యుడి ప్రతాపం అధికంగా చూపించగా వ్యవసాయ రైతులు వర్షం కోసం ఎదురుచూస్తుండగానే ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురవడంతో అన్నదాతల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడడంతో ఎవరు కూడా ఇంటి నుంచి బయటకు వెళ్లలేదు. మరో రెండు రోజుల పాటు ఇలాగే వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

ఓటరు నమోదుపై కలెక్టర్ మండిపాటు

- ఇద్దరు అధికారులకు షోకాజు నోటీసులు



నవతెలంగాణ-కౌటాల

ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు అధికారులపై కొమురంభీం జిల్లా కలెక్టర్ హేమంత్ సహదేవరావు బొర్కాడె మండిపడ్డారు. ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఓటరు నమోదు సవరణ చేపట్టారు. అందులో మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక శిబిరాలను తనిఖీ చేశారు. కౌటాల మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీలో ఓటరు నమోదు కేంద్రంలో బీఎల్‌ఓలను ఓటరు నమోదు కోసం అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వచ్చిన సమయంలో తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో అక్కడే ఉన్న సీనియర్ అసిస్టెంట్ దౌలత్‌రావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్ని కొత్త దరఖాస్తులు వచ్చాయి. నిబంధనల ప్రకారం ఉండాల్సిన ఐదు కూపన్ కొత్త ఓటర్ల సంఖ్య గుర్తించి స్పష్టంగా చెప్పకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. అడిగింది అర్థమవుతుందా అంటూ బీఎల్‌ఓలు, సీనియర్ అసిస్టెంట్‌ను ప్రశ్నించారు. వారు సరైన రీతిలో సమాధానం చెప్పకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యత లేకుండా వ్యవహరించిన తహసీల్దార్ కిరణ్‌తో పాటు సీనియర్ అసిస్టెంట్ దౌలత్‌కు 1951 ప్రజా ప్రాతినిధ్య చట్టం కింద షోకాజు నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయనతో పాటు కౌటాల ఎస్సై మధూకర్ ఉన్నారు.

రూ. లక్షల నిధులు నీళ్లపాలు

- నిర్మించిన ఒక్కరోజుకే కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన
- దుర్వినియోగమవుతున్న ప్రజాధనం

ఒక్క పని చేపడితే ఆ పని పదికాలాల పాటు మన్నికగా ఉండాలని చూస్తారు. అది ప్రభుత్వ పని అయితే మరింత జాగ్రత్తగా నిధులను వెచ్చించాల్సి ఉంటుంది. కాని ఇక్కడ పరిస్థితి దీనికి భిన్నంగా ఉంటోంది. 'ప్రజాధనమే కదా, వృధా అయితే మనకేంటి' అనే రీతిలో అధికారులు, పాలకులు వ్యవహరిస్తున్నారు. దీనికి నిదర్శనంగా కాగజ్‌నగర్ మండలం అందవెల్లి పెద్దవాగు తాత్కాలిక వంతెన నిర్మాణాన్ని చెప్పుకోవచ్చు.



వరదకు నామరూపాలు లేకుండా కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన (నిన్న)

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలంలోని అందవెల్లి పెద్దవాగుపై నిర్మించిన తాత్కాలిక వంతెన ఆదివారం ఉదయం కొట్టుకుపోయింది. ఈ వంతెన నిర్మాణం పూర్తి చేసి 24 గంటలు కాకముందే వరదకు కొట్టుకుపోవడం చర్చనీయాంశంగా మారింది. పెద్దవాగుపై శాశ్వత వంతెన నిర్మాణంలో జాప్యం జరుగుతుండడంతో తాత్కాలికంగా పైపులు, మట్టితో వంతెన నిర్మించారు. ఈ వంతెన నిర్మాణం శనివారం సాయంత్రంతో ముగిసింది. ఇంకా రాకపోకలు కూడా ప్రారంభం కాలేదు. ఆదివారం ఉదయం పెద్దవాగులో వచ్చిన వరదకు ఈ తాత్కాలిక వంతెన నామరూపాలు లేకుండా కొట్టుకుపోయింది. దీనికి ముందు కూడా ఒకసారి

అందవెల్లి పెద్దవాగు వద్ద పూర్తయ్యిన తాత్కాలిక వంతెన (మొన్న)



తాత్కాలిక వంతెన నిర్మించగా, కొద్ది రోజుల తర్వాత కొట్టుకుపోయిన విషయం తెల్సిందే. అప్పట్లో కొన్ని రోజుల పాటు ప్రజలకు సౌకర్యం కలిగింది. కాని ఇప్పుడు మాత్రం ఒకరోజు కూడా పూర్తి కాకముందే వంతెన కొట్టుకుపోవడం గమనార్హం.

ఇంజనీరింగ్ అధికారులేం చేస్తున్నారు..?

కాగా పెద్దవాగులో వరద వస్తే ఈ తాత్కాలిక వంతెన ఆగదని తెలిసీ ఇంజనీరింగ్ అధికారులు దీనిని ఎందుకు నిర్మించారనేది ఇప్పుడు ప్రశ్న. ఇంకా వర్షాకాలం పూర్తి కాలేదు. రెండు, మూడు రోజుల్లో భారీ వర్షాలు ఉన్నాయని ఒక పక్క వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. అయినా అధికారులు ఈ తాత్కాలిక వంతెన ఏర్పాటుకు ఎందుకు తొందరపడ్డారు? నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఒత్తిడి మేరకు ఈ వంతెన నిర్మాణం చేపట్టినట్లు పేరు చెప్పడానికి ఇష్టపడని అధికారి ఒకరు తెలిపారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఓట్ల కోసం నాయకులు అధికారులపై పనుల కోసం ఒత్తిడి తేవడం సహజం. వరద వస్తే ఆ వంతెన కొట్టుకుపోతుందని ఆ ప్రజాప్రతినిధికి కూడా తెలుసు. కాని పోతే పోనీ ప్రభుత్వ ధనమే కదా అని అనుకున్న ప్రజాప్రతినిధి, ప్రజల సౌకర్యం కోసం తాను కృషి చేస్తున్నట్లు కనపడిపతే చాలు అనుకున్నాడు. కాని సాధ్యాసాధ్యాలను పరిశీలించి ముందుకు పోవాల్సిన అధికారులు కూడా ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకు తలొగ్గి ఈ విధంగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

పద్మశాలి శంఖారావంకు తరలిన నాయకులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించ తలపెట్టిన పద్మశాలి శంఖారావసభకు జిల్లా నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశాలీల ఐక్యత సాటే సమయం ఆసన్నమైందన్నారు. ఐక్యంగా ఉన్నప్పుడే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని తెలిపారు. శంఖారావంతో మరోసారి తమ బలం తెలుస్తుందన్నారు. హైదరాబాద్ బయలుదేరిన వారిలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, జిల్లా గౌరవ అధ్యక్షుడు సామల రాజన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి గడదాసు మల్లయ్య, రాష్ట్ర నాయకులు గుండా శంకర్, నల్ల కనకయ్య, నాయకులు మంగ, లింగయ్య, శ్రీకాంత్, అనుమాండ్ల శ్రీకాంత్, శైలేందర్, ప్రణయ్, శ్యామ్, ప్రకాష్, శ్రీనివాస్, మోహన్, తిరుపతి, మహేష్, ప్రకాష్, ప్రవీణ్, అశోక్, సునీల్, వెంకన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థికి సెంట్రల్ యూనివర్శిటీలో సీటు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి వడ్లూరి విశాల్ హైద్రాబాద్‌లోని సెంట్రల్ యూనివర్శిటీలో సీటు సాధించాడు. దేశవ్యాప్తంగా సెంట్రల్ యూనివర్శిటీలలో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే పీజీ ప్రవేశపరీక్షలో ఎంఎ తెలుగు విభాగంలో విశాల్ జాతీయ స్థాయిలో 40వ ర్యాంక్ సాధించి ఈ సీటు సంపాదించినట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మినరసింహం తెలిపారు. రెబ్బెన మండలం ఇందిరానగర్‌కు చెందిన విశాల్ ఇంటర్మీడియట్ విద్యను రెబ్బెన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, డిగ్రీ విద్యను కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అభ్యసించాడు. రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రవేశపరీక్షలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తుండడంతోనే తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నట్లు ఈ సందర్భంగా ప్రిన్సిపల్ తెలిపారు.

ప్రాణాలు హరిస్తున్న ప్లాస్టిక్

- నిషేధం అమలుచేయని అధికారులు
- విచ్చలవిడిగ పాలిథిన్ కవర్ల వినియోగం



నవతెలంగాణ-దహెగాం

ప్లాస్టిక్ కవర్ల వాడకంతో పర్యావరణం దెబ్బతింటుందని తెలిసినా వాటి వినియోగాన్ని ఆపలేకపోతున్నారు. నిత్యవసర సరుకులతో పాటు కూరగాయలు, పండ్లు, కిరాణ సామగ్రిని వ్యాపారులు కవర్లలోనే ఇస్తున్నారు. వినియోగదారులు సైతం చేతిసంచిని తీసుకెళ్లడం లేదు. పాలిథిన్ కవర్ల వల్ల లాభాల కన్న నష్టాలే ఎక్కువ అనే విషయాన్ని అందరు మరిచిపోతున్నారు. పర్యావరణ సమతుల్యం లోపించి వాతావరణ కాలుష్యం ఏర్పడుతోంది. ఒక ప్లాస్టిక్ మట్టిలో కలవడానికి దాదాపు 10 సంవత్సరాలు సమయం పడుతుందని శాస్త్రవేత్తలు చెపుతున్నా ఎవరు పట్టించుకోవడంలేదు. టీ తాగాలన్న డిస్పోజల్ గ్లాసులను, భోజనం చేయాలన్న, టిఫిన్ చేయాలన్న ప్లాస్టిక్ ప్లేట్లను వినియోగిస్తున్నారు. విందులకు, శుభ కార్యాలయాల్లో అతిథులకు మంచినీరు ఇవ్వడం దగ్గరి నుండి భోజనాలు వడ్డించే వరకు ప్లాస్టిక్‌నే అధికంగా వాడుతున్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల క్యాన్సర్, మెదడువాపు, జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, సంతానోత్పత్తికి హాని కలగడం, చిన్న పిల్లలో బుద్ధి మాద్యం వంటి ప్రాణాపాయ రోగాల బారిన పడే అవకాశాలు నిండుగా ఉన్నాయి. ప్లాస్టిక్ పాలిథిన్ కవర్ల అమ్మకాలపై నిషేధమున్నా సంబంధిత అధికారులు మామూలుగా తీసుకొని వాటి ఉత్పత్తులను నిలిపివేయక పోవడం వల్లనే అనర్థాలు పెరిగిపోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ప్లాస్టిక్ వాడకంపై నిషేధాన్ని అమలుచేయడంతో పాటు వాడకం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించినట్టయితే పెను ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చని ప్రజలు అంటున్నారు.

అమలుకు నోచుకోని నిషేదాజ్ఞలు

పర్యావరణ పరిరక్షణ చట్టం 1986 ప్రకారం ప్లాస్టిక్ వ్యర్థాల నిబంధనలు 2011 ఆధారంగా 40 మైక్రాన్ల కన్న తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ ఉత్పత్తులైన పాలిథిన్ కవర్లు, టీ కప్పులు, ప్లేట్లు, గ్లాసులు, ప్లాస్టిక్ సీసాలు, ఎన్నికల, ఇతర ప్రచార సామగ్రి, తోరణాలు, ఫ్లెక్సీలపై నిషేధం విధించారు. 2013లో జారీ చేసిన జీవో నెంబర్ 46 ఉత్తర్వుల ప్రకారం 40 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన వస్తువులను ఉత్పత్తి చేయడం కానీ, నిలువలు చేయడం కానీ, పంపిణీ చేయడం, విక్రయించడం నిషేధం. ఒకవేళ ఎవరైన వ్యాపారులు నిషేదిత ప్లాస్టిక్ ఉత్పత్తులను విక్రయించినట్టయితే రూ.2500 నుండి రూ.5 వేల వరకు జరిమానా విధించారు. అలాగే తయారీ దారులకు రూ.25 వేల నుండి రూ.50 వేల వరకు జరిమానా విధించాల్సి ఉంది. కానీ సంబంధిత అధికారులు నామమాత్రంగా దాడులు నిర్వహించి సమాచారాన్ని వారే సంబంధిత వ్యాపారులకు ముందుగా చెపుతూ మామూలుగా వ్యవహరిస్తుండడంతో నిషేధం అమలుకాకుండా పోతుందని పలువురు విమర్శిస్తున్నారు.

ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలు

నిషేధిత ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, గ్లాసులు వంటివి నీటిని, మట్టిని, గాలిని కలుషితం చేస్తాయి. వర్షపు నీరు భూమిలోకి ఇంకకుండా అడ్డుకుంటాయి. వీటి తయారీలో వినియోగించే జెంజిన్ వినైల్ క్లోరైడ్ వంటి రసాయనిక ఉత్పత్తుల వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశముంది. ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల్లో ఆహార పదార్థాల వినియోగం వల్ల గర్భంలోని శిశువు ఆరోగ్యానికి సైతం హాని కలుగుతుందని పరిశోదకులు చెపుతున్నారు. పశుగ్రాసంతో పాటు పశువులు ప్లాస్టిక్ వ్యర్థాలను తింటూ అనారోగ్యం పాలవుతున్నాయి. చెరువులు, నదుల్లో వ్యర్థాలను వేయడం వల్ల వీటిని తినే చేపలు మృత్యువాత పడుతున్నాయి. ప్లాస్టిక్ సంచులు, ఉత్పత్తులు వినియోగించి పడేసిన తర్వాత కాల్చివేయడం వల్ల చెలరేగే మంటలు పొగతో పాటు విషపూరిత వాయువులను విడుదల చేస్తున్నాయి. దీనివల్ల కూడా ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు.

ఇవి చేయకుంటే మంచిది..

మంచినీరు, ఆహార ఉత్పత్తులు, వేడి ద్రవ పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల్లో ఉంచకూడదు. రీసైక్లిన్ ఉత్పత్తులు, బ్యాగులు, తేలిగ్గా కరిగే గుణం కలిగిన రంగులు గల ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు వినియోగించొద్దు. రంగులతో కూడిన ప్లాస్టిక్ ఉత్పత్తుల సంచుల్లో ఆహార పదార్థాలు నిల్వ ఉంచడం వల్ల రసాయనాలు వెలువడే అవకాశముంది. అంతేకాకుండా ప్లాస్టిక్‌ను ఆస్పత్రి, చికెన్ సెంటర్‌లో, పండ్ల రసాల దుకాణాలు, గృహాలు, నీటి దుకాణాల్లో వినియోగించకుండా చూసినట్టయితే ప్రజలను ప్రాణాంతక వ్యాధుల బారి నుండి కాపాడుకోగలుగుతామని పలువురు సూచిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గ్రామాల్లో, పట్టణాల్లో, వారాంతపు సంతలలో దాడులు నిర్వహించి ప్లాస్టిక్ నిషేధంపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలి : విఘ్నేష్ రౌతు



ప్లాస్టిక్ కవర్లను ప్రభుత్వం పూర్తిగా నిషేధించాలి. ప్లాస్టిక్‌ను వినియోగించడం వల్ల భవిష్యత్ తరాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ప్లాస్టిక్ నిషేధంపై అప్పుడప్పుడు ఎక్కడో ఒకచోట ప్రకటనలు వస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో అధికారులు చర్యలు తీసుకున్నట్టు ఎక్కడ కనబడడంలేదు. దీంతో ప్రతి ఊరిలో ప్రతి చోట ప్లాస్టిక్ వ్యర్థాలు కుప్పలుతెప్పలుగా పడి కనిపిస్తున్నాయి. పశువులు సైతం వాటిని తిని అవి జీర్ణం కాక రోగాల బారినపడి చనిపోయిన దాఖలాలు కూడా చాలానే ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించి, వాటివల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలి.

కాంగ్రెస్ మండల అధ్యక్షునిగా తోట రవి

నవతెలంగాణ - హాజీపూర్



కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షునిగా పడ్తనపల్లి గ్రామానికి చెందిన తోట రవి మూడవ సారి నియామకం అయ్యారు. గుడిపేట గ్రామానికి చెందిన పీఏసీఎస్ వైస్ చైర్మెన్ రాసమల్ల శ్రీనివాస్ గౌడ్ జిల్లా జనరల్ సెక్రెటరీగా నియామకం కాగా వారికి మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యుడు ప్రేమ్ సాగర్ రావు ఆదివారం తన నివాసంలో నియామక పత్రాలు అందజేశారు. తమకు కాంగ్రెస్ పార్టీ పదవులు కట్టబెట్టిన ప్రేమ్ సాగర్ రావుకు కతజ్ఞతలు తెలుపుతూ కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కృషిచేస్తామన్నారు.

మాల సంఘం గ్రామ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ - కాసిపేట



సోమగూడెం గ్రామ మాల కులస్తుల కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. మాల సంఘం గ్రామ అధ్యక్షుడిగా బాదె శ్రీనివాస్, కార్యదర్శిగా గొల్ల పోశంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాల కులస్తుల అభివద్ధికి తన వంతు కృషి చేస్తానని నూతనంగా అధ్యక్షుడిగా ఎన్నికైన బాదె శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాల సంఘం నాయకులు పులి రాజారాం, గుండా సత్యనారాయణ, బన్న దుర్గయ్య, పైడిమల్ల రాయమల్లు, బన్న రాయలింగు, పాముల శివయ్య, తోట భూమయ్య, బొడ్డు శంకర్, సంకె లింగయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎంపీపీ



నవతెలంగాణ-జన్నారం

మాజీ ఎంపీపీ మచ్చ శంకరయ్య, తన అనుచరులతో కలిసి ఆదివారం సాయంత్రం గాంధీభవన్‌లో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడమ బొజ్జు ఆధ్వర్యంలో, టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ బలంగా ఉందని ఈ సారి 30 సంవత్సరాల చరిత్రను తిరగరాసి అభ్యర్థిని గెలిపించుకుంటామన్నారు. వెడమ బొజ్జుకు ఖానాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా అవకాశం కల్పిస్తే భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని మాజీ ఎంపీపీ మచ్చ శంకరయ్య రేవంత్ రెడ్డికి తెలుపగా, వారు సానుకూలంగా స్పందించినట్లు మత్స్య శంకరయ్య తెలిపారు. కేంద్రంలో బీజేపీ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, కాంగ్రెస్‌ను బలోపేతానికి కృషి రేవంత్‌రెడ్డి సూచించారని తెలిపారు.

ప్రమాదవశాత్తు లారీ కిందపడి క్లీనర్ మృతి

నవతెలంగాణ-జైపూర్

జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లో శనివారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు లారీ కిందపడి క్లీనర్ దిలీప్ మోంటో అక్కడికక్కడే మృతి చెందాడు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మృతుడు ఎస్టీపీపీలో యాష్ లోడ్ చేసుకోవడం కోసం వచ్చి ప్రమాదంలో చిక్కుకున్నాడు. యాష్ లోడ్ కోసం సీరియల్ నెంబర్ తీసుకోవడం కోసం వెళ్లివస్తున్న దిలీప్ మోంటో రివర్స్‌గా వస్తున్న లారీ వెనుక టైర్ల కిందపడటంతో తలపై నుండి వెళ్లిన వెనుక టైర్ల కిందపడినట్లు స్థానిక ఏఎస్సై ఎంఏ అజీజ్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బోయపల్లిలో నా మట్టి.. నా దేశం



నవతెలంగాణ-తాండూర్

మేరీ మాటి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా బోయపల్లి గ్రామంలో హనుమాన్ దేవాలయంలో నా మట్టి నా దేశం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంకి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి పాల్గొన్నారు. భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా దేశ రాజధాని ఢిల్లీలో పవిత్ర అమృత వాటిక నిర్మాణానికి ప్రతి గ్రామం నుంచి మట్టి సేకరించి పంపనున్నట్లు తెలిపారు. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన వీరుల సంస్మరణార్థం దేశ రాజధాని ఢిల్లీలో పవిత్ర అమృతవాటిక నిర్మిస్తున్నారని అన్నారు. ఈ గొప్ప కార్యంలో రాజకీయాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలు జాతీయవాదులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బోయపల్లి హనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని పవిత్ర మట్టిని సేకరించి, పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకష్ణదేవరాయులు, అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ రాజులాల్ యాదవ్, బోయపల్లి శక్తి కేంద్రం ఇన్‌ఛార్జి మాసాడి రవీందర్, నాయకులు నామని రాజ్ కుమార్, ఎలిగేటి నరేష్, మిట్ట అభి, ఎలిగేటి శివ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలు పెంచి వారిని క్రమబద్ధీకరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వేరబెల్లి రఘునాథ్ డిమాండ్ చేసారు. ఆదివారం రఘునాథ్ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులతో కలిసి నస్పూర్ సీసీసీ క్రాస్ రోడ్ వద్ద కార్మిక దీక్ష కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా 2016 లో ముఖ్యమంత్రి కేసీఆర్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు రెగ్యులరైజ్ చేస్తామని చెప్పి 8 ఏండ్లు గడిచిన ఇప్పటి వరకు కార్మికులకు ఇచ్చిన హామీ నెరవేర్చలేదని అన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కోల్ ఇండియా లో అమలు చేస్తున్న హై పవర్ కమిటీ వేతనాలు చెల్లించకుండా కార్మికుల శ్రమను సింగరేణి యాజమాన్యం దోచుకుంటుందని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చిన 6 నెలలోపు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలు చెల్లిస్తామని తెలిపారు. కార్మికుల వేతనాలు పెంచకపోతే త్వరలో కార్మికులతో కలిసి ప్రగతి భవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గాలివాన భీభత్సం

- లేచిపోయి ఇండ్ల పైకప్పులు
- నేల వాలిన భారీ వృక్షాలు
- తెగి పడిన విద్యుత్ వైర్లు

వర్షం భీభత్సం శ్రష్టించింది. ఆదివారం మధ్యాహ్నం జిల్లాలో గాలి వాన అతలాకుతలం చేసింది. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలు మండలాల్లో లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. పంట చేలలో వరదలు పొంగాయి. గాలులకు రహదారులపై చెట్లు విరిగి పడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పాడింది. కరెంట్ తీగలు తెగి పడడంతో పలు గ్రామాలు అందకారంలో వున్నాయి.



నవతెలంగాణ - హాజీపూర్

గత నెల రోజులుగా వర్షాలు లేక పంటలు ఎండిపోయే పరిస్థితి ఉండేది. ఎండ, ఉక్కపోతలో ప్రజలు బెంబేలెత్తి పోయారు. వానలు కురవాలని పూజలు కూడా చేశారు. కానీ ఆదివారం ఒక్క సారిగా వాతావరణం మారింది. నల్లటి మబ్బుల కమ్ముకొని ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. శనివారం జిల్లాలో పిడుగులు పడిన సంఘటనలు, అక్కడక్కడ వర్షం పడింది. ఆదివారం జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షం కురిసింది. సరైన సమయలోవర్షం కురిసిన కూడా పంటలకు నష్టం చేకురింది. బలమైన గాలులకు ఇండ్ల పైకప్పులు లేచిపోయి ఆస్తినష్టం వాటిల్లింది.

లేచిపోయిన ఇండ్ల పైకప్పులు..

హాజీపూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఇండ్ల పైకప్పులు లేచిపో యాయి. ముల్కాల్ల గ్రామంలో జిల్లా పశువైద్యశాల సమీమంలోని ఇండ్ల పైకప్పులు గాలికి ఎగిరిపోయాయి. గుండా శ్రీను అనే కులీ ఇంటి పైకప్పు పక్క ఇంటి సమీపంలో పడింది. ఇంట్లోని సామాగ్రి తడిసి ముద్దైంది. అదే గ్రామంలో బొల్లి కాంతక్క, జీ.తిరుపతి, గుర్రపు వెంకటేష్, గాదాసు లక్ష్మణ్‌ల ఇంటి రేకులు గాలికి



కొట్టుకుపోయాయి. భారీ వానకు చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ వైర్లు తెగిపోవడంతో అధికారులు సరఫరా నిలిపి వేశారు. మండలంలోని రాపల్లి, నర్సింగాపూర్, ముల్కాల్ల, నంనూర్, వేంపల్లి, టీకానపల్లి గ్రామాల్లో పంట పొలాల్లోకి వరద నీరు చేరింది. వరి పొలాల గట్లు తెగి గండ్లు పడ్డాయి. పత్తి పంట పూత రాలి రైతులకు నష్టం కలిగించింది.

కాసిపేట : మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం వర్షం కురిసింది. ఉదయం ఒక్కసారిగా మబ్బు కమ్ముకవచ్చి ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. ఇటీవల నుంచి వర్షాలు లేక తీవ్ర ఉక్కపోతతో ఇబ్బంది పడ్డజనానికి వర్షం ఉరట ఇచ్చింది. వర్షం కురవడంతో పత్తి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



చచ్చిపోతాము అనుకున్నాం

- గుండు శ్రీను కుటుంబం,ముల్కాల్ల



ఆదివారం మధ్యాహ్నం ఒక్క సరిగా ఉరుములు, మెరుపులతో కూడా భారీ వర్షం రావడంతో మా ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. వర్షానికి తడుచుకుంటూనే ప్రాణాలు అరచేతిలో పెట్టు కొని బిక్కు బిక్కు మంటూ గడిపాం. భారీవర్షం ఉరుములు, మెరుపులకు తాము చచ్చిపోతామని అనుకున్నాం.

కోల్‌మైన్స్ పెన్షన్ పెంపు

సమస్యను కేంద్రం దృష్టికి తీసుకుపోవాలి

నవతెలంగాణ-జైపూర్

కోల్‌మైన్స్ పెన్షన్ పెంపుదలకు సంబందించిన సమస్యను కేంద్రం దృష్టికి తీసుకుపోవాలని సింగరేణి మాజీ డైరెక్టర్, రిటైర్డ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జేవీ దత్తాత్రేయులు కోరారు. ఆదివారం కలకత్తాలో కోల్ ఇండియా చైర్మెన్ పీఎం ప్రసాద్‌ను కలిసిన ఆయన పెన్షన్ పెంపుదల సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. పెన్షన్ ఫండ్ పెంపుకు అమ్మకం జరిపితేనే ప్రతి టన్ను బొగ్గు విరాళం పెంచాలని వినతి పత్రంలో వివరించారు. 2018లో సీఎంపీఎఫ్ బోర్డ్ ట్రస్ట్ సమావేశంలో సబ్ కమిటీ సిఫార్సులను అమలు చేయడం, కోల్ మైన్స్ పెన్షన్ స్కీం 1998 ప్రకారం వితంతువు పింఛన్ అవంతారలు లేకుండా నూతన పెన్షన్ పేమెంట్ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. బొగ్గు పెన్షనర్ల సమస్యలను ప్రస్తావించడానికి కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ వారి బోర్డ్ ఆఫ్ ట్రస్ట్‌లో ఫెడరేషన్ ఆఫ్ కోల్ ఇండస్ట్రీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిదులకు అవకాశం కల్పించాలని కోరారు. 70,75 సంవత్సరాలు నిండి పదవీ విరమన పొందిన వయోవృద్దులకు ఓఎన్జీసీ ఇతర ప్రభుత్వ రంగ

- కోల్ ఇండియా చైర్మెన్ పీఎం ప్రసాద్‌ను కలిసిన వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు



చమురు సంస్థలు ఒకే మొత్తంలో అమలు చేస్తున్న ఫెలిసిటేషన్ పథకాన్ని బొగ్గు పెన్షనర్లకు అమలు పర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోల్ ఇండియా మాజీ చైర్మెన్ ఆర్‌బీ ఉపాధాయ, బిమన్ మిత్ర, ఇతర ఫెడరేషన్ ఆఫ్ కోల్ ఇండియా రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిదులు పాల్గొన్నట్లు సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఆళవందార్ వేణుమాదవ్ తెలిపారు.

బీఆర్ఎస్‌కు మూకుమ్మడి రాజీనామా



నవతెలంగాణ-మందమర్రి

బీఆర్ఎస్ పార్టీకి 200మంది యువకులు ఆదివారం మూకుమ్మడి రాజీనామా చేసారు. బీఆర్ఎస్‌వీ స్టేట్ సెక్రెటరీ ఎండీ ముజాహిద్, ఆర్కెపి యూత్ ప్రెసిడెంట్ బింగి శివకిరన్, మందమర్రి 17వ వార్డు అధ్యక్షుడు పోలు నరేష్, ఆర్కేపీ సోషల్ మీడియా ఇన్‌ఛార్జి ఎండీ ఇందాస్‌ల ఆధ్వర్యంలో మందమర్రి శ్రీ కృష్ణ ఫంక్షన్ హాల్లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండలానికి చెందిన 200మంది యువకులు బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి మూకుమ్మడి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బాల్క సుమన్ అహంకార వైఖరికి నిరసనగా ఆత్మగౌరవం కోసం తాము రాజీనామా చేస్తున్నామని తెలిపారు. ఉపాధి అవకాశాలు కల్పించకపోవడం, స్థానికులని పట్టించుకోక పోవడం, యువకుల భవిష్యత్తు నాశనం చేసి రాబోయే తరం భవిష్యత్తు నాశనం చేద్దామనుకునే నాయకునికి బుద్ధి చెప్పి మా యువకులను కాపాడుకోడానికే రాజీనామా చేశామని తెలిపారు. నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఉండి పూర్తిగా హైద్రాబాద్‌కే పరిమితం కావడం స్థానిక సమస్యలను పట్టించుకోక పోవడంతోనే తామంతా రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధి అవకాశాలు యువత భవిష్యత్తు కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందనే నమ్మకంతో వేలాది మందిగా త్వరలో కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లుగా ప్రకటించారు.

సారు విద్యుత్ స్థంభం మార్చరూ..

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని చింతపల్లి గ్రామంలో వాటర్ ట్యాంక్ నుంచి ఎస్సీ కాలనీకి వెళ్లేదారిలో స్తంభం ఒకవైపు వంగిపోవడంతో అటు నుంచి వెళ్లే కాలనీవాసులు భయంతో వెళ్తున్నారు. పంట పొలాల కొరకు పక్కనే కాలువలో పూడిక తీయడంతో స్తంభం ఒకవైపు వంగి ఎప్పుడు ఎప్పుడు పడుతుందోనని ఎస్సీ కాలనీవాసులు బిక్కుబిక్కుమంటూ ఆ దారి గుండా నడుస్తున్నారు. పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోవడంలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వంగిపోయిన విద్యుత్ స్తంభాన్ని సరిచేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పేదల న్యాయం చేయాలి

- బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తుంగపిండి రమేష్



నవతెలంగాణ-చెన్నూర్

పేదలకు న్యాయం చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జీ తుంగపిండి రమేష్ అన్నారు. ఆదివారం బాపురావ్‌పేట శివారు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలో కబ్జాలు చేసి బిల్డింగులు కట్టుకున్న ఉన్నోనికి వత్తాసు పలుకుతున్నారని అన్నారు. ప్రభుత్వ అసైన్డ్ భూములను పేదలకు ఇస్తే వారికి భూములను పట్టాలు చేసుకొని కబ్జా చేస్తున్నారని అన్నారు. వెంటనే కలెక్టర్ స్పందించి బాధితులకు నష్టపరిహారం అందిచాలని, వారికి తగిన పోలీసు రక్షణ కూడా కల్పించాలని తెలిపారు. లేనీ పక్షంలో వీరికి మద్దతుగా బీఎస్పీ దర్నాలు చేస్తుందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ సీనియర్ నాయకులు పులిపాక శ్రీనివాస్, చొప్పదండి అశోక్, గరిగే వేంకటేశ్వర్లు, మామిడిపెల్లి ప్రకాష్, గరిసే సూర్య, అరే వరుణ్, గుడిసెల బాధితులు రాజేశ్వరి, సరిత, అనసూర్య, సమ్మక్క పాల్గొన్నారు.

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మ హత్యాయత్నం

నవతెలంగాణ-చింతలమానేపల్లి

గడ్డిమందు తాగి ఒక వ్యక్తి ఆత్మ హత్యాయత్నానికి పాల్పడ్డ ఘటన మండలంలోని బాబాసాగర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... మానేపెల్లి మంగయ్య మద్యానికి బానిసై, అప్పుడప్పుడు మతిస్థిమితం కోల్పోయి ఉండటంతో అదే క్రమంలో ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో, ఇంట్లో ఉన్న గడ్డిమందును తగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి కాగజ్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపినట్టు కుటుంబీకులు తెలిపారు.

108 అంబులెన్స్‌లో సుఖ ప్రసవం



నవ తెలంగాణ-కోటపల్లి

మండలంలోని లక్ష్మీ పూర్ గ్రామానికి చెందిన బుల్లే సౌందర్య 108 వాహనంలో ఆదివారం ఉదయం సుఖ ప్రసవం చేసింది. బుల్లే సౌందర్యకి ఆదివారం తెల్లవారు 5గంటలకు పురిటి నొప్పుల రావడంతో 108 వాహనానికి ఫోన్ చేశారు. లక్ష్మీపూర్ చేరుకున్న వాహన సిబ్బంది సౌందర్యాను చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్‌ను పక్కకు అపి వైద్యులు సుఖ ప్రసవం చేశారు. తల్లి,బిడ్డ క్షేమంగా ఉన్నట్లు ఈఎంటి షాషెబాజ్, పైలెట్ ఫరీద్ తెలిపారు. ప్రస్తుతం చెన్నూర్ ఆస్పత్రి ఉన్నారన్నారు.

జాన్సన్ నాయక్‌ను కలిసిన సర్పంచులు



నవతెలంగాణ-జన్నారం

మండలం పలు గ్రామాల సర్పంచులు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్‌ను కలిశారు. ఆదివారం ఖానాపూర్ పట్టణంలోని జాన్సన్ నాయక్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని అన్ని గ్రామాల అభివద్ధికి సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్నపథకాలను ప్రజలకు తెలియజేస్తూ మరోమారు ఖానాపూర్‌లో బీఆర్ఎస్ జెండాను ఎగరవేయాడానికి సర్పంచులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జన్నారం సర్పంచుల ఫోరం అధ్యక్షులు జాడి గంగాధర్, సర్పంచ్ జక్కు భూమేష్, తదితరులు పాల్గొన్నారు.

132కేవీ సబ్ స్టేషన్ సాధించేవరకు పోరాటం

నవతెలంగాణ-జన్నారం



మండల కేంద్రంలో 132కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ సాధించే వరకు తన పోరాటాన్ని కొనసాగిస్తామని సామాజిక ఉద్యమకారుడు భూమాచారి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరావధిక దీక్ష ఆదివారం 8వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే మండల కేంద్రంలో 132 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఆదివారం జోరువానలో కూడా అతను దీక్ష కొనసాగించగా, విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై పి సతీష్ అక్కడి చేరుకొని ఆయన్ను సముదాయించారు. వర్షం కారణంగా, తన నిరావధిక దీక్షను వాయిదా వేసుకుంటున్నట్లు భూమాచారి తెలిపారు. సమస్య పరిష్కారం కాకుంటే మళ్లీ దీక్షను చేస్తానని అన్నారు. ఆయన దీక్షకు సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు జాడి గంగాధర్ సంఘీభావం తెలిపారు.

ఓటర్ నమోదు కేంద్రాల తనిఖీ

నవతెలంగాణ-చింతలమానేపల్లి



మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఓటర్ నమోదు కేంద్రాలను ఆసిపాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 19 వరకు ఓటర్ నమోదు కార్యక్రమంతో పాటు మార్పులు, చేర్పులు, తొలగింపునకు అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్క పౌరులు ఓటర్ నమోదు తప్పకుండా చేసుకునే విదంగా చూడాలని సూచించారు. దివ్యాంగులు, వికలాంగులు ఉన్నట్లయితే వారి ఇంటి వద్ద వెళ్లి నమోదు కార్యక్రమం చేయాలని అన్నారు. వాటికి సంబంధించి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ నాగరాజుగౌడ్, ఎస్సై వెంకటేష్ రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

రైతులకు అన్నివిధాల సహకరించాం



నవతెలంగాణ-తాండూర్

వ్యవసాయ విద్య, పరిశోధన, విస్తరణవిభాగాల ద్వారా రైతాంగానికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం అండగా నిలిచిందని కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ కోట శివకృష్ణ అన్నారు. ఆదివారం విశ్వవిద్యాలయం 9వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కృషి విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక, వ్యవసాయ విద్య, పరిశోధన మరియు విస్తరణ విభాగాల ద్వారా తెలంగాణ రైతాంగానికి వ్యవసాయ విశ్వవిద్యాలయం అండగా నిలిచిందన్నారు. వరి, ప్రత్తి, మొక్కజొన్న, జొన్న, మిరప, కంది, పెసర, వేరుశనగ, నువ్వులు, కుసుమ వంటి నూతన వంగడాలను సాగులోనికి తెచ్చామన్నారు. వ్యవసాయంలో, యాంత్రీకరణ, జీవన ఎరువుల వాడకం, సమగ్ర పంటల యాజమాన్యం, చీడపీడల నియంత్రణ, నీటి యాజమాన్యం, భూసార పరిరక్షణ, విలువ ఆధారిత ఉత్పత్తుల వంటి అనేక అంశాలలో రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం అనేక పరిశోధనలు చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగంలో విశేష కృషి చేస్తున్న కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన రైతులు బుద్దె విజయ్ కుమార్(పెర్క పల్లి, తిర్యాని మండలం), వడాయి శంకర్ (గంగాపూర్, రెబ్బెన మండలం) రైతు పురస్కరాలు అందించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డా. తిరుపతి, డా. స్రవంతి, నాగరాజు, డా. సతీష్ పాల్గొన్నారు.

ప్లీనరీ సమావేశాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 6న హైదరాబాద్‌లో నిర్వహించే మున్నూరు కాపు జర్నలిస్ట్ ఫోరం రెండవ ప్లీనరీ సమావేశాలు విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అడప సతీష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఎస్‌వీఐటీ కళాశాలలో రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్ పటేల్ అధ్యక్షతన ప్లీనరీ నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలోని మున్నూరు కాపు చెందిన జర్నలిస్టులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వంకులం విద్యార్థులు స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని వంకులం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న బొర్కుటె నిహారిక, నాల్గవ తరగతి చదువుతున్న వగాడె తేజశ్రీ మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఎంపిక పరీక్షలో తమ ప్రతిభను ప్రదర్శించి స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు జాడి ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ దేవులె ప్రకాష్, ఉపాధ్యాయులు స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

హైనా దాడిలో మేక మృతి



నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని ఎలుకపెల్లి గ్రామానికి చెందిన నికాడి మల్లయ్యకు చెందిన మేకపై బెజ్జూర్ అటవీ ప్రాంతంలో హైనా దాడి చేసింది. మేక ఆదివారం అటవీ ప్రాంతానికి మేత కోసం వెళ్లగా హైనా దాడిచేసింది. దీంతో మేక మృతిచెందినట్టు యజమాని తెలిపారు. బెజ్జూర్ బీట్ అధికారి అనితకు సమాచారం అందజేసినట్టు తెలిపారు.

కాగజ్‌నగర్ నుంచి బస్సు సర్వీసుల పెంపు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మూడో రైల్వే పనుల కారణంగా కాగజ్‌నగర్ నుంచి పలు ప్యాసింజర్ రైళ్లు రద్దు కావడం, కాగజ్‌నగర్ బస్టాండ్‌లో ప్రయాణీకుల రద్దీ పెరిగిన కారణంగా కాగజ్‌నగర్ బస్టాండ్ నుంచి మంచిర్యాలకు ప్రతీ పది నిమిషాలకు ఒక బస్సు ఏర్పాటు చేసినట్లు ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీధర్ తెలిపారు. ప్రయాణీకుల అవసరం నిమిత్తం కాగజ్‌నగర్ నుండి బెల్లంపల్లి, మంచిర్యాలకు వెళ్లేందుకు ఈ బస్సులను పెంచినట్లు తెలిపారు. అదేవిధంగా ఆసిఫాబాద్ నుండి హైద్రాబాద్ వెళ్లే ప్రతీ బస్సును వయా కాగజ్‌నగర్ మీదుగా నడిపిస్తున్నామని, ప్రయాణీకులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే

కుటుంబానికి రూ.12 లక్షలు

నవతెలంగాణ-ఇచ్చోడ



రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ కుటుంబాలకు రూ.12 లక్షలు ఒక్కొక్క కుటుంబానికి అందిస్తుందని పీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొమ్ము విజయ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా బోథ్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం మొత్తం దళిత సమాజం అంతా కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తుందని అన్నారు, బోథ్‌లో ప్రతి దళిత పల్లెను సందర్శించి చేవెళ్లలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నాయకులు బట్టి విక్రమార్క, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ విడుదల చేశారు. ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్ పెంచడం, ఎస్సీల కొరకు అంబేద్కర్ అభ్యాసం పేరిట రూ.12 లక్షలను ప్రతి ఎస్సీ కుటుంబానికి ఇచ్చే విధంగా డిక్లరేషన్‌లో పెట్టడం జరిగిందని అన్నారు. ప్రతి పేద కుటుంబానికి ఆరు లక్షలతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించడానికి డిక్లరేషన్‌లో ఇవ్వడం జరిగిందన్నారు. అదేవిధంగా మూడు ఎస్సీ కార్పొరేషన్లను ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం 750 కోట్లతో సంక్షేమ అభివృద్ధికి డిక్లరేషన్‌లో పెట్టడం జరిగిందన్నారు. ఇంకా వివిధ రకాల సంక్షేమ పథకాలను దళితుల కొరకు పెట్టి దళితులను ఆదుకునే విధంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిందని అన్నారు. వాటిని ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తూచా తప్పకుండా అమలు చేసే విధంగా కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు లింగంపల్లి చంద్రయ్య, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, గుడిహత్నూర్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దుబ్బాక నరేష్, బోథ్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు అంజయ్య, నేరడిగొండ ఎస్-ఎస్ఎల్ మండల అధ్యక్షుడు నారాయణ, సిరికొండ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు గైక్వాడ్ బాబురావు, బ్లాక్ అధ్యక్షుడు మహిమూద్ ఖాన్, ఇచ్చోడ మండల అధ్యక్షులు కళ్లెం నారాయణరెడ్డి, స్థానిక ఎంపీటీసీ జాహిద్, బోథ్ నియోజవర్గం మైనార్టీ చైర్మెన్ ముస్తఫా, టౌన్ ప్రెసిడెంట్ బాబా, కోటేష్, ముస్తాక్, మహబూబ్ పాల్గొన్నారు.

మేకను దొంగిలించారనే నెపంతో పాశవిక చర్య

- జాడ లేని కిరణ్ ఆచూకీ • కమిషనర్ ఆదేశాలతో నాలుగు ప్రత్యేక బృందాల ఏర్పాటు



నవతెలంగాణ-మందమర్రి

మేకను దొంగిలించారనే నెపంతో పాశవిక చర్యకు పాల్పడింది మానవత్వం లేని ఓ కుటుంబం. అవమానంతో కనిపించకుండా పోయిన బాధితుడు కిరణ్. తన కొట్టంలోని మేకను దొంగిలించారనే నెపంతో తలకిందులుగా కట్టేసి శరీరం కింద పొగబెట్టి కొడుతూ చిత్రహింసలకు గురి చేసిన ఘటన శుక్రవారం జరిగింది. మందమర్రి పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో బెల్లంపల్లి ఏసీపి పంతాటి సదయ్య తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని యాపల్ ప్రాంతానికి చెందిన రాములు-స్వరూప దంపతుల కుమారుడు శ్రీనివాస్ కుటుంబం ఊరు శివారులో మేకల వ్యాపారం చేస్తున్నారు. తేజ(19) వీరి ఇంట్లోనే ఉంటూ పశువుల కాపరిగా పని చేస్తున్నాడు. 20 రోజుల క్రితం ఒక మేక, ఇనుపపైపు కనిపించకుండా పోవడంతో కాపరి తేజ అతని స్నేహితుడు కిరణ్ (30)లే చేశారనే అనుమానం పడ్డారు. దీంతో రాములు, శ్రీనివాస్, స్వరూప, నరేష్లు శుక్రవారం వీరిని తీసుకొని వెళ్లి షెడ్డులో తలకిందులుగా కట్టేసి తల కింద మంట పెట్టి చిత్రహింసలు చేపట్టారు. డబ్బులు ఇస్తేనే విడిచి పెడతామని చెప్పడంతో వీధిలోని తాపీ మేస్త్రీ ఒకరు డబ్బులు కడుతానని భరోసా ఇచ్చి కిరణ్‌ని తీసుకెళ్లాడు. కానీ శుక్రవారం సాయంత్రం నుండి కిరణ్ కనిపించడం లేదని కిరణ్ చిన్నామ్మ నిట్టూరి సరిత శనివారం మందమర్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఘటన జరిగిన వేళ్లిన పోలీసులు పరిశీలించి స్థానికుల సమాచారాన్ని, కొట్టిన వీడియోలు, ఫోటోలు సేకరించారు. శనివారం రాములు, శ్రీనివాస్, స్వరూపలను అదుపులోకి తీసుకుని ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. మంచిర్యాల జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టగా వారికి రిమాండ్‌కు తరలించారు. ఆదివారం నాలుగో నిందితుడు నరేష్‌ని అదుపులోకి తీసుకుని తదుపరి ప్రక్రియ కొనసాగిస్తున్నామని తెలిపారు.

నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు

కిరణ్ ఆచూకీ కోసం రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి ఆదేశాల మేరకు నాలుగు ప్రత్యేక టీంలుగా ఏర్పాటు చేశామని ఏసీపీ సదయ్య అన్నారు. నాలుగు బృందాలు గాలించి త్వరలో కిరణ్‌ను క్షేమంగా తీసుకువస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సీఐ మహేందర్ రెడ్డి, మందమర్రి ఎస్సై చంద్రకుమార్, కాసిపేట ఎస్సై గంగారాం, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

- కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్కే మోహన్

నవతెలంగాణ-హాజీపూర్

దళిత యువకులను మేకల దొంగతనం చేశారన్న అనుమానంతో యజమాని వారిని తాళ్లతో కట్టేసి తలకిందుల వేలాడదీసి కొట్టిన ఘటనలో యజమానిపై కఠిన చర్యలు తీసుకోవాలని కుల వివక్ష పోరాట సమితి జిల్లా కార్యదర్శి దుర్కే మోహన్ ఆదివారం ఒక ప్రకటన పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం యాపల్ ఏరియా ప్రాంతంలో చాకలి రాములు యాజమాని మేకలు అపహరణకు గురైతే కాపరి తేజ, అతని స్నేహితుడు కిరణ్ మీద అనుమానంతో వారిని షెడ్డులో తలకిందులుగా వెలడదీసి పొగపెట్టి చితక బదడం అవమానీయ ఘటన అన్నారు. నిజాం చెప్పిన వినకుండా దళిత యువకుడిపై దాడికి పాల్పడిన యాజమనిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రకారం వెళ్లకుండా దళితుడు నా మేకను దొంగలిస్తాడా అనే కుల దురహంకారంతో చిత్రహింసలకు గురి చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అవమానం భరించలేక కిరణ్ ఎవరికి చెప్పకుండా పారిపోయాడనీ తెలిపారు. తక్షణమే మేకల యజమాని చాకలి రాములు పైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. లేనియెడల బాధితుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు.

సభకు తరలిన పద్మశాలీలు

నవతెలంగాణ-జన్నారం



హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన పద్మశాలి శంశరవ సభకు మండల పద్మశాలి సంఘం నాయకులు తరలివేళ్లారు. ఈ సందర్భంగా మండల పద్మశాలి మండల అధ్యక్షలు చేటుపెల్లి గంగయ్య మాట్లాడుతూ పద్మశాలీలంతా ఏకమై ఐక్యంగా పోరాటం చేస్తేనే హక్కులు సాధించుకోవచ్చన్నారు. అన్ని మండలాల నుంచి భారీగా ఈ పద్మశాలి శంఖరవ సభకు వేళ్లారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చేటుపల్లి సత్యం, సారంగపాణి, భాస్కర్, వీరయ్య, చేటుపెల్లి కష్ణ, గోనె సత్యం, రాజన్న, గడ్డం తిరుపతి, మొర మల్లేశం, నీలేశ్, లచ్చన్న, రమేష్, శంకరయ్య, దవనపల్లి, రాజు, శ్రీనివాస్, పొరండ్ల మల్లేష్ పాల్గొన్నారు.

పోలీస్ గస్తీ పటిష్టం చేయాలి



నవతెలంగాణ-తాండూర్

తాండూర్ ఐబిలో శాంతి భద్రతలకు విగాతం కలుగకుండా పోలీస్‌లు పటిష్టమైన గస్తీ నిర్వహించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. రాత్రివేళలో పోలీసులు గస్తీ నిర్వహించకోవడంతో మండల కేంద్రమైన ఐబి కూడలి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద మందుబాబుల ఆగడాలు మితిమీరిపోతున్నాయని ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దానికి తోడు మండల కేంద్రంలో గత రెండు రోజులుగా రాత్రి వేళల్లో దొంగల కలకలం స్థానికులను కలవరానికి గురిచేస్తుంది. శనివారం రాత్రి మండల కేంద్రానికి చెందిన బ్యాంకు రాము ఇంట్లో దొంగలు చోరీకి యత్నించారు. అటు చోరీ కలకలం మందుబాబుల ఆగడాలతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. మందుబాబులు తాగిన సీసాలను బీరు బాటిల్‌లను ఐబి కూడలి వద్ద పడవేయడంతో ప్రయాణికులు స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. అదేవిధంగా నేషనల్ హైవే నుంచి చౌటపల్లి, కాసిపేట, మాదారం వైపు వెళ్లే రహదారులపై మందుబాబుల ఆగడాలు మితిమీరడంతో బాటసారులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. కాజీపేట, చౌటపల్లి రహదారుల వెంట అభయారణ్యాల మామిడి తోటలు ఉండడంతో బాటసారులు ఆందోళన చెందుతున్నారు. శని, ఆదివారం రాత్రి వేళల్లో రాజీవ్‌నగర్ ఐబీ లలో వరుసగా చోరీకి యత్నించడం స్థానికులను కలవరపెడుతోంది. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పోలీస్ అధికారులు భద్రత వ్యవస్థను పటిష్టం చేయాలని ప్రజలకు కోరుతున్నారు.

అడవి పందుల భయంతో రోడ్డు ప్రమాదం

- ముగ్గురికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-బెజ్జూర్

అడవి పందుల గుంపును చూసి భయాందోళనకు గురై ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తులు కిందపడి గాయాలైన సంఘటన బెజ్జూర్ మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లుంబినినగర్ గ్రామానికి చెందిన ఇప్ప జగదీష్, ఇప్ప సుమన్, శేఖర్ ఆదివారం వర్షం పడుతుండగా సలుగుపెల్లి నుంచి లుంబునినగర్ వైపు వెళ్తున్న క్రమంలో కుంటలమానెపెల్లి సమీపంలో ప్రధాన రహదారిపై అడవి పందుల గుంపు కనిపించడంతో భయాందోళనకు గురై ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనం పైనుండి కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. గాయాలపాలైన క్షతగాత్రులను కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మ హత్యాయత్నం

నవతెలంగాణ-చింతలమానేపల్లి

గడ్డిమందు తాగి ఒక వ్యక్తి ఆత్మ హత్యాయత్నానికి పాల్పడ్డ ఘటన మండలంలోని బాబాసాగర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. స్తానికులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... మానేపెల్లి మంగయ్య మద్యానికి బానిసై, అప్పుడప్పుడు మతిస్థిమితం కోల్పోయి ఉండటంతో అదే క్రమంలో ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో, ఇంట్లో ఉన్న గడ్డిమందును తగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి కాగజ్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపినట్టు కుటుంబీకులు తెలిపారు.

బీజేపీ బలోపేతానికి కృషి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

బీజేపీ బలోపేతానికి మాలి సంఘం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. మాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లెండుగురె శ్యాంరావు ఇటీవల ఖమ్మంలో కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్‌షా సమక్షంలో బీజేపీలో చేరిన విషయం తెల్సిందే. ఆదివారం ఆయన కాగజ్‌నగర్‌కు రాగా డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే రోజులలో మరింత మంది పార్టీలో చేరేలా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముత్తు అశోక్, అరుణ్‌లోయ, మందాడె సుధాకర్, మాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణలో వచ్చేది డబుల్ ఇంజన్ సర్కారే

- బీజేపీ జాతీయ కౌన్సిల్ మెంబర్ రమేష్ రాథోడ్..



నవతెలంగాణ-జన్నారం

తెలంగాణలో బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్ అధికారంలోకి వస్తుందని జాతీయ కౌన్సిల్ సభ్యులు, మాజీ ఎంపీ,రమేష్ రాథోడ్ ధీమావ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని కవ్వాల్ గ్రామానికి చెందిన పలువురు రమేష్ రాథోడ్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. అనంతరం బంగారుతండాలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ సర్కార్ మోసపూరిత పథకాలతో ప్రజలను మభ్యపెట్టారని ఆరోపించారు. అప్పుల బాధతో రైతులు, ప్రభుత్వ ఉద్యోగాలు లేక నిరుద్యోగ యువత బలవన్మరణానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం నీతివంతమైన పాలనకు తెలంగాణ ప్రజలు ఆకర్షితులయ్యారని, రాబోయే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటవ్వడం ఖాయామన్నారు. ఈ కార్యక్రమంలో జన్నారం మండల అధ్యక్షులు గోలిచంద్, జిల్లా కార్యదర్శి కొంతం శంకరయ్య, మధుసూదన్ రావ్, నాయకులు శివలింగయ్య, బుర్ర గడ్డ జగన్, రాజేష్, రాకేష్, సాయి, శ్రీనివాస్ దేవందర్, శంకర్ పాల్గొన్నారు.

ఓటర్ నమోదుకు విశేష స్పందన

నవతెలంగాణ-ఎడపల్లి

18 సంవత్సరాల నిండిన యువతి యువకులు కొత్తగా ఓటర్ నమోదు కోసం సంబంధిత గ్రామాల బూత్ లెవెల్ స్థాయి అధికారులకు దరఖాస్తులను చేసుకుంటున్నారు. మండలంలోని 17 గ్రామపంచాయతీల్లో (బిఎల్వోలు) రెండు రోజుల నుండి అందుబాటులో ఉంటూ దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. తహసిల్దార్ మోతి సింగ్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సందీప్‌తో పాటు సంబంధిత అధికారులు పర్యవేక్షణ నిర్వహిస్తూ నమోదు అయినటువంటి ఓటర్ లిస్టు జాబితాలను అధికారులు పరిశీలించారు. మంగళ్ పహాడ్, జానకంపేట ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన ఓటర్ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రెవెన్యూ అధికారులు బిఎల్వోలతో సమావేశం ఏర్పాటు చేస్తూ ఓటర్ నమోదులో ఎలాంటి తప్పిదాలు లేకుండా జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని బిఎల్ఓ లను సూచిస్తున్నారు. ఆదివారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల లో ఏర్పాటుచేసిన ఓటర్ నమోదు కార్యక్రమానికి 18 సంవత్సరాల నుండి యువతి యువకులు భారీ పెద్ద మొత్తంలో దరఖాస్తులు చేసుకున్నారు. మండలంలోని మంగళ్ పహాడ్ లో బూత్ లెవెల్ స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శి ,(బిఎల్ వో లు),,రామిరెడ్డి, (అంగన్వాడి ఉపాధ్యాయురాలు,)బండ కళ్యాణి, జానకంపేటలో గ్రామపంచాయతీ కార్యదర్శి, బూత్ లెవెల్ స్థాయి అధికారి ప్రేమ్ దాస్, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.